శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## మురుగు నీరు తొలగించరా!



**బిట్రగుంట మే 12 ప్రభాతవార్త** బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీలోని రామస్వామి పాలెం గ్రామంలో అంబేద్కర్ నగర్ కాలనీలో మురుగునీరు తొలగించకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెలల తరబడి కాలువలు శుభ్రం చేయకపోవడంతో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తూ ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా ఉంది. తక్షణమే పంచాయతీ అధికారులు స్పందించి మురుగు నీరు సక్రమంగా వెళ్లేలా చర్యలు తీసుకోవడంతో పాటు ఈ ప్రాంతంలో వీధి దీపాలు కూడా వెలిగేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## గండి క్షేత్రంలో వెలసి ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామిని
### దర్శించుకున్న రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి



**నెల్లూరు, మే 12, ప్రభాతవార్త–వైద్యం** : గండి క్షేత్ర జీవనోద్ధరణ, మహాకుంభాభిషేక కార్యక్రమాలలో పాల్గొన్న మంత్రి ఆనం గండి క్షేత్రానికి విచ్చేసిన మంత్రి ఆనంకు ఘన స్వాగతం పలికిన దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ అర్చకులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసిన దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ నిర్వాహకులు స్వామివారి దర్శనం అనంతరం వేద పండితుల ఆశీర్వచనం అందుకున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సీజీఎఫ్ నిధుల ద్వారా రూ.23.49 కోట్లు, దేవస్థానం నిధుల ద్వారా రూ.4.50 కోట్ల వ్యయంతో చేపట్టనున్న దేవస్థాన జీర్ణోద్ధరణ పనులకు శ్రీకారం చుట్టిన మంత్రి ఆనం గండి క్షేత్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్న మంత్రి ఆనం కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యేలు, కడప జిల్లా ప్రజాప్రతి నిధులు, వివిధ రంగాల ప్రముఖులు, దేవా దాయ శాఖ అధికారులు, ఆలయ సిబ్బంది భక్తుల సౌకర్యాల అభివృద్ధి, ఆలయ వైభవ పునరుద్ధరణకు ప్రత్యేక చర్యలు తీసుకుం టామని వెల్లడించిన మంత్రి ఆనం.

**మంత్రి ఆనం మీడియాతో మాట్లాడుతూ..:** ఈరోజు హనుమాన్ జయంతి సందర్భంగా శ్రీ గండి



ప్రసన్నాంజనేయ స్వామి వారిని దర్శించుకోవడం ఆనందంగా ఉంది : రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి హిందూ మత ధర్మానికి, సనాతన సంప్రదాయాలకు, వైదిక ఆచార వ్యవస్థలకు కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉంది : గండి క్షేత్రంలో వీరాంజనేయ స్వామి వారి ఆలయ నిర్మాణ పనులు పూర్తయ్యాయని, గత వారం రోజులుగా హోమాలు, ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి : రేపు పూర్ణాహుతితో మహాకుంభాభిషేక కార్యక్రమాలు ఘనంగా ముగుస్తాయి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే గండి ప్రసన్నాంజనేయ స్వామి క్షేత్రం అత్యంత ప్రాముఖ్యత కలిగిన పవిత్ర ఆధ్యాత్మిక కేంద్రంగా నిలిచింది రూ.28 కోట్ల వ్యయంతో గండి ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ క్షేత్ర అభివృద్ధి పనులు చేపట్టాము : ఇతిహాసాలు, పురాణాల్లో గండి క్షేత్రానికి విశిష్ట స్థానం ఉందని, ఈ క్షేత్ర వైభవాన్ని ప్రపంచానికి చాటేలా అభివృద్ధి చేస్తున్నాము కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ప్రతి ఆలయాన్ని భక్తులకు మరింత చేరువ చేస్తున్నాము : సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ పారదర్శక దర్శన విధానాలు అమలు చేస్తున్నాము : మఠాధిపతుల సమక్షంలో సంప్రోక్షణ కార్యక్రమం కలదు : రాష్ట్ర వ్యాప్తంగా సీజీఎఫ్ నిధులు, ధూపదీప నైవేద్య పథకాలు, భజన మందిరాల అభివృద్ధి ద్వారా ధర్మ పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోంది : రాష్ట్ర దేవాదాయ శాఖ పనితీరు గతంతో పోలిస్తే అద్భుతంగా మెరుగుపడింది ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలలో దాదాపు 98% శాతం అమలు చేశాము.

## పారదర్శకంగా విధులు నిర్వహించండి..

- ప్రజలకు మంచి చేయాలనే ఆలోచనతో విధులు నిర్వహించండి..
- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల
- ప్రజా సమస్యల పరిష్కారమే ఉద్యోగుల ప్రధాన బాధ్యత
- ప్రస్తుత వేగవంతమైన సమాజంలో చిన్న తప్పు చేసినా ప్రజల్లో దోషులుగా నిలబడే పరిస్థితి
- పదోన్నతులు పొందిన వీఆర్వోలకు కలెక్టర్ ప్రేరణాత్మక సందేశం
- రికార్డు స్థాయిలో 110 మంది సచివాలయాల వీఆర్వోలకు గ్రేడ్2 నుంచి గ్రేడ్ 1 వీఆర్వోలుగా పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు అందజేసిన కలెక్టర్



**నెల్లూరు కలెక్టరేట్, మే 12, ప్రభాతవార్త:** ప్రజలకు మంచి చేయాలనే ఆలోచనతో ప్రతి ఉద్యోగి విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా వ్యాప్తంగా వీఆర్వో గ్రేడ్2 నుంచి గ్రేడ్ 1కు పదోన్నతులు పొందిన 110 మంది సచివాలయాల వీఆర్వోలకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, డిఆర్ఓ విజయ్ కుమార్ నియామక ఉత్తర్వులను అందజేశారు. పదోన్నతులు కల్పిస్తూ పోస్టింగులు కేటాయించిన సందర్భంగా కలెక్టర్ వీఆర్వోలకు ప్రేరణాత్మక సందేశం ఇచ్చారు. పలు సమస్యలతో తమ వద్దకు వచ్చే ప్రజలను గౌరవించి, వారి సమస్యలను పరిష్కరించేందుకు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. విధులను క్రమశిక్షణతో నిర్వర్తిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. విధుల్లో ఎటువంటి అలసత్వానికి పాల్పడకుండా నిజాయితీగా, పారదర్శకంగా ప్రజలకు సేవ చేయాలని కలెక్టర్ హితవు పలికారు. ప్రస్తుత వేగవంతమైన సమాజంలో చిన్న తప్పు చేసినా వెంటనే ప్రజల్లో దోషులుగా నిలబడే పరిస్థితి ఉందని, సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరిగి సమాజం ఉక్కపోయేలా మాటే పరిస్థితులు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ఈ తప్పులు జరగకుండా ప్రజలకు మేలు చేయాలనే ఆలోచనతో ప్రతి ఉద్యోగి పనిచేయాలని అన్నారు. మన వంతుగా సమాజానికి కొంత మంచి చేశామనే సంతృప్తి కలిగితేనే మన ఉద్యోగానికి న్యాయం చేసినట్లవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. వీఆర్వోలు ప్రజలతో నేరుగా సంబంధాలు కలిగి ఉంటారని, వారికి ప్రభుత్వ పరంగా అవసరమైన సహాయ సహకారాలు అందించడం బాధ్యతగా భావించాలని సూచించారు. ఈ సందర్భంగా ఒకే విడతలో 110 మందికి పదోన్నతులు కల్పించిన జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్ఓలకు వీఆర్వోలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సచివాలయ వీఆర్వోలకు తొలిసారిగా పదోన్నతులు కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి శ్రీనివాసులు, తాసిల్దార్ డానియల్ పీటర్ తదితరులు పాల్గొన్నారు.

## వివాహేతర సంబంధం వద్దన్నందుకు అత్తను హత్య చేసిన కోడలు



**కావలి, మే 12 ప్రభాతవార్త** :వివాహేతర సంబంధం వద్దన్నందుకు అత్తను కోడలు హత్య చేసిన సంఘటన దగదర్తి మండలం సున్నబట్టి గ్రామంలో జరిగింది. ఈ సందర్భంగా స్థానిక కావలి రూరల్ పోలీస్‌స్టేషన్ నందు మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డిఎస్‌పి వాకా వెంకటరమణ కుమార్ వివరాలను వెల్లడించారు. దగదర్తి మండలం సున్నబట్టి గ్రామానికి చెందిన మైపాటి మాధవి(46)ను ఆమె కోడలు మైపాటి పద్మశ్రీ ఆమె తల్లి పుచలపల్లి మాధవి సయాంతో **మే** 8న అర్ధరాత్రి హత్య చేసిందని ఆయన తెలిపారు. మృతురాలి అన్నకూతురు అయిన మైపాటి పద్మశ్రీని ఏడేళ్ళ క్రితం తన కుమారుడు పవన్‌కళ్యాణ్‌కు ఇచ్చి వివాహం చేసుకోగా వారికి ఒక పాప, బాబు కలిగారన్నారు. పద్మశ్రీ తన భర్త స్నేహితుడైన దినేష్‌తో అక్రమ సంబంధం పెట్టుకోవడంతో అత్త పలుమారు మందలించి పెద్దలకు కూడా విషయం తెలిపిందన్నారు. తన అక్రమ సంబంధకు అడ్డు వస్తుందన్న ఉద్దేశంతో పద్మశ్రీ, తన తల్లి మాధవిలు కలసి దారుణంగా అత్తను హత్య చేశారు. అనుమానం రాగా కోడూరు పద్మ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారిణ చేపట్టారు. ఈ విచారణలో నిజా నిజాలు తెలిసాయి. ఈ కేసులో రూరల్ సిఐ శివశంకర్, దగదర్తి ఎస్ఐ జంపాని కుమార్‌లు చేదించి నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును చేదించిన పోలీసు అధికారులకు రివార్డులు కోసం సిఫారసు చేశామని తెలిపారు.

## నేడు జెడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం



**నెల్లూరు కలెక్టరేట్, మే 12, ప్రభాతవార్త** జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలు ఈ నెల 13న నిర్వహించనున్నట్టు సీఈవో శ్రీధర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రణాళిక, ఆర్థిక విషయాల పనుల విషయాల, గ్రామీణ అభివృద్ధి విషయాల, వ్యవసాయ విషయాల, విద్య వైద్య ఆరోగ్య విషయాల, స్త్రీ శిశు సంక్షేమ విషయాల, సాంఘిక సంక్షేమ విషయాల, స్థాయి సంఘాల సమావేశాలు జరుగుతా యన్నారు. ఆయా స్థాయి సంఘాల చైర్మన్ల అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సభ్యులు, తమ తమ శాఖలకు సంబంధించిన పూర్తి స మాచారంతో ఆయా శాఖల అధికారులు హాజరుకావాలని సీఈవో ఆ ప్రకటనలో కోరారు.

## కృష్ణపట్నం పోర్టు నుంచి వియత్నాంకు
# మొక్కజొన్న ఎగుమతి నౌక ప్రారంభం

- నౌకను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, పోర్టు సీఈఓ జగదీష్ పటేల్
- 53,318 మెట్రిక్ టన్నుల మొక్కజొన్నతో వియత్నాంకు బయలుదేరిన ఎం.వి. పర్వరాజ్ నౌక
- రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక చర్యలు



**ముత్తుకూరు, మే 12, ప్రభాతవార్త:** నెల్లూరు జిల్లా రైతులు పండించిన మొక్కజొన్నకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యల్లో భాగంగా కృష్ణపట్నం పోర్టు నుంచి వియత్నాంకు మొక్కజొన్న ఎగుమతి నౌకను మంగళ వారం ప్రారంభించారు. మంగళ వారం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి జగదీష్ పటేల్‌తో కలిసి కృష్ణపట్నం పోర్టులో మొక్కజొన్న ఎగుమతి నౌకను జెండా ఊపి ప్రారంభించారు. ఎం.వి.పర్వరాజ్ పేరుతో బయలుదేరిన ఈ నౌక ద్వారా 53,318 మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను వియత్నాంకు ఎగుమతి చేస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో మొక్కజొన్న పంట అధికంగా దిగుబడి రావడంతో రైతులకు గిట్టుబాటు ధరలు లభించేలా జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్, వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ మొక్కజొన్న ఎగుమతులకు అవసరమైన ఏర్పాట్లు జిల్లా యంత్రాంగం చేపట్టింది. మొక్కజొన్న ఎగుమతుల ద్వారా రైతులకు విస్తృత మార్కెట్ అవకాశాలు లభించడంతో పాటు, వ్యవసాయ ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ పెరుగుతుందని అధికారులు తెలిపారు. రైతుల ఆదాయం పెంచేందుకు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యల్లో ఇది ఒక ముఖ్యమైన ముందడుగుగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోర్టు అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, సంబంధిత విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మే 19న మత్స్యకార భరోసా సభలో పాల్గొననున్న సిఎం చంద్రబాబు

- తుమ్మలపెంటలో సభావేదిక, హెలిప్యాడ్‌కి స్థలాం
- పరిశీలించిన జిల్లా కలెక్టర్, కావలి ఎమ్మెల్యే



**కావలి, మే 12 ప్రభాతవార్త :** మే 19న కావలి రూరల్ మండలం, తుమ్మలపెంట గ్రామంలో నిర్వహించను న్న మత్స్యకార భరోసా కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరు కానున్నడంతో మంగళ వారం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటక్రిష్ణాఆరెడ్డిలు పాల్గొని సభా వేధిక ఏర్పాటుకు ఎంపిక చేసిన స్థలాన్ని పరిశీలించారు. హెలిప్యాడ్ నిర్మాణానికి అనుకూల ప్రదేశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఏపి ప్రభుత్వం అమలు చేసునతన్న ప్రతిష్టాత్మక సంక్షేమపథకం మత్స్యకార భోరసా కింద సముద్రవేట నిషేదకాలంలో ఉపాధి కోల్పోయే మత్స్యకారులను ఆదుకోవాలనే లక్ష్యంతో ప్రతి అర్హత కలిగిన మత్స్యకార కుటుంబానికి రూ.20వేలు ఆర్తికసాయం అందించనుంది. ఈ నేపథ్యంలో సిఎం సభకు పెద్దసంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉండడంతో తగిన ఏర్పాట్లు చేయాలని వారు అధికారులకు ఆదేశించారు. నియోజకవర్గ పరిధిలో మొత్తం 2892 మత్స్సకార కుటుంబాలు ఈ పథకం ద్వారా లబ్ధిపొందనున్నట్లు అధికారులు తెలిపారు. సిఎం రాకపై కావలి ఎమ్మెల్యే దగుమాటి హర్షం తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత తొలిసారిగా ముఖ్యమంత్రి కావలి నియోజకవర్గంలోని తుమ్మలపెంట గ్రామానికి రావడం సంతోషంగా ఉందనానన్రు. తుమ్మలపెంటలో జరిగే ఈ కార్యక్రమంతో మత్స్యకార భరసాతో జీవితాల్లో మార్పు తీసుకువచ్చే కార్యక్రమంగా నిలుస్తుందన్నారు. ఈ సభలో మత్స్సకారుల ఎదుర్కొంటున్న అనేక సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్ళనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా వీరికి బోట్లు,సముద్ర తీర ప్రాంతాల్లో రోడ్లు అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, తీర ప్రాంత గ్రామాల అభివృద్ధికి అవసరమైన అంశాలపై సిఎం వద్ద ప్రత్యేకంగా ప్రస్తావించనున్నట్లు వెల్లడించారు. మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వ కట్టుబడి ఉందన్నారు. తుమ్మలపెంట కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు. ఈకార్యక్రమం విజయవంతానికి అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహణ

- డిఆర్ఓఎన్ విజయ్ కుమార్



**నెల్లూరు కలెక్టరేట్, మే 12, ప్రభాతవార్త** జిల్లాలో ఈనెల 21 నుండి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు, ఈనెల 25వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి విజయకుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని డిఆర్ఓ వారి ఛాంబర్‌లో ఇంటర్, పదోతరగతి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలపై సంబంధిత అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి విజయ్ కుమార్ మాట్లాడుతూ పరీక్షల నిర్వహణకు విధులు కేటాయించిన అధికారులందరూ ఎటువంటి లోటు పాట్లు లేకుండా పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలని సూచించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా జరిగే విధంగా, అలాగే ప్రథమచికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్న దృష్ట్యా ప్రతి పరీక్షా కేంద్రంలో తాగునీటి వసతి సౌకర్యం కల్పించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద తగిన పోలీస్ బందోబస్తు 144 సెక్షన్ ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీసీ అధికారులు పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకునేలా బస్సులను నడపాలని సూచించారు. పోలీసు, రెవెన్యూ, మెడికల్, విద్యుత్ తదితర శాఖల అధికారులు విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలను నిర్వహించేందుకు సన్నద్ధం కావాలన్నారు. ఇంటర్మీడియట్ అధికారి వరప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి జూన్ 4వ తేదీ వరకు జిల్లాలో 66 పరీక్షా కేంద్రాల్లో ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి 28693 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్షలకు సంబంధించి విద్యార్థులకు ఏమైనా సందేహాలు ఉంటే కంట్రోల్ రూమ్ నెంబర్ 08612320312 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు. జిల్లా విద్యాశాఖాధికారి ఆర్ బాలాజీ రావు మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 25 నుంచి జూన్ 4వ తేదీ వరకు వరకు పదో తరగతి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మొత్తం 31 సెంటర్లలో 4124 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు చెప్పారు. అలాగే ఈనెల 25 నుంచి జూన్ 1వ తేదీ వరకు ఏపి ఓపెన్ స్కూల్ ఇంటర్, టెన్త్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షల నిర్వహణకు చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు, పరీక్షల తనిఖీ బృందాలను నియమించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఆర్ఐవో వర ప్రసాద్ రావు, డిఇఒ ఆర్ బాలాజీ రావు, మున్సిపల్, విద్యుత్, మెడికల్ అండ్ హెల్త్, పోలీసు, ఆర్‌టిసి అధికారులు పాల్గొన్నారు.

## తొలిసారిగా నెల్లూరులో మహానాడు నిర్వహించడం ఆనందం



**కొడవలూరు, మే 12, ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మక వార్షిక మహాసభ మహానాడు కోసం నెల్లూరు జిల్లా పరుగులు పెడుతోంది. కొడవలూరు మండలం ఇఫ్కో కిసాన్ సెజ్లో మే 27, 28, 29 తేదీల్లో నిర్వహించనున్న మహానాడు ఏర్పాట్లు యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్నాయి. సభా ప్రాంగణ నిర్మాణం,గ్యాలరీలు,వసతి,భోజన,భద్రతా ఏర్పాట్లను పార్టీనేతలు సమన్వయంతో వేగవంతం చేస్తున్నారు.

❍ మంగళవారం కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మహానాడు ప్రాంగణాన్ని సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్, రాష్ట్ర ఎన్విరాన్మెంట్ మేనేజ్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పొలంరెడ్డి దినేష్ రెడ్డి, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి తదితరులతో కలిసి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.

❍ **ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ..** యువనేత నారా లోకేష్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా నెల్లూరులో మహానాడు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కేడర్ పండుగలా నిర్వహించి విజయవంతం చేస్తామని తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. మహానాడు ద్వారా పార్టీ ప్రతిష్ట మరింత ఇనుమడించేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. నెల్లూరులో తొలిసారి ఇంత భారీ స్థాయిలో మహానాడు నిర్వహించే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు జిల్లా ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

బుధవారం రాష్ట్ర కమిటీ నేతలు, మహానాడు నిర్వహణ కమిటీ సభ్యులు ప్రాంగణాన్ని సందర్శించి పనుల పురోగతిపై తుది దిశానిర్దేశం చేయనున్నట్లు వెల్లడించారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, చైర్మన్లు, పార్టీ ఇన్చార్జ్లు సమిష్టిగా పనిచేసి మహానాడును దిగ్విజయం చేయాలని పిలుపునిచ్చారు.

❍ ఈ కార్యక్రమంలో అబ్దుల్ అజీజ్, పొలంరెడ్డి దినేష్ రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, రూప్ కుమార్ యాదవ్, కోడూరు కమలాకర్ రెడ్డి, దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, చెముకుల కృష్ణచైతన్య, నాపా వెంకటేశ్వర్ల నాయుడు, గరికిపాటి రాజేంద్ర, ఏకుల్ల వంశీధర్ రెడ్డి, పల్లంరెడ్డి సురేష్ రెడ్డి, కోవూరు వెంకీ, పంది శ్రీనివాసులు, బద్దిపూడి సూర్య, ఎస్కే భాషి తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం ఏర్పాటులో మొక్కులు తీర్చుకున్న నేతలు

- 1001 టెంకాయలు మొక్కు





**కోవూరు, మే12 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ దక్షిణాముఖ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి సందర్భంగా కోవూరు టీడీపీ నేతలు పట్టణ పార్టీ అధ్యక్షుడు ఇంతా మల్లారెడ్డి ఆధ్వర్యంలో 1001 టెంకాయ కొట్టి తమ మొక్కు తీర్చుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైతే ఈ మొక్కు తీర్చుకుంటామని టీడీపీ నేతలు కోరుకున్నారు. ఈ మేరకు మంగళవారం ఆలయానికి వచ్చిన కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి , రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, ఏపీఎంఎఫ్‌సీఎల్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డిలు ఈ ముఖ్య కార్యక్రమాన్ని టెంకాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గం వేమిరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో రాష్ట్రంలో అభివృద్ధి పథంలో ప్రథమ స్థానంలో ఉండాలని ఆంజనేయ స్వామిని కోరుకున్నామన్నారు. అదేవిధంగా ఈ నెల 27,28,29 తేదీల్లో కోవూరు నియోజకవర్గ పరిధిలోని కిసాన్ సెజ్‌లో జరుగుతున్న మహానాడు పూర్తిస్థాయిలో విజయవంతం కావాలని కోరుకోవడం జరిగిందన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమానికి వచ్చిన ప్రజాప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. మహానాడు కార్యక్రమానికి పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి, సొసైటీ చైర్మన్ నాగారెడ్డి శ్యామ్ సుందర్‌రెడ్డి పార్టీ సీనియర్ నాయకులు తాడిపర్తి విజయారెడ్డి, గాదిరాజు అశోక్‌కుమార్, పచ్చిక మధుసూదన్‌రావు, మల్లికార్జునరెడ్డి,వెంకటరమణమ్మ, జాన్సన్, సుధాకర్, విజయ్‌బాబు, కూటమి నేతలు సుబ్బారావు, శ్రీనివాసులురెడ్డి, తదితరులు ఉన్నారు.

## శ్రీప్రసన్న ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక పుష్పాలంకరణ



**బుచ్చి మే 12 ప్రభాతవార్త** హనుమజ్జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని జొన్నవాడ క్షేత్రంలోని శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక పుష్పాలంకరణ అత్యంత వైభవంగా నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో స్వామి వారిని అలంకరించి ప్రత్యేక అర్చనలు,హారతులు, శాస్త్రోక్త పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వాతావరణం భక్తి శ్రద్ధలతో కళకళలాడగా,భక్తులు పాల్గొని స్వామి వారి దివ్యరూపాన్ని దర్శించుకొని ప్రత్యేక ఆశీర్వాదాలు పొందారు. అనంతరం తిరుచ్చి ఉత్సవముపై శ్రీప్రసన్న ఆంజనేయస్వామి వారి గ్రామోత్సవంలో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారి తిరుచ్చి ఉత్సవంలో అర్చకులు వేదమంత్రోచ్చరణల నడుమ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించగాభజంత్రీలు ,సేవకులు పాల్గొని ఉత్సవ వైభవాన్ని మరింత విశిష్టంగా తీర్చిదిద్దారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆర్వభూమి వెంకట శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దర్శన ప్రసాద శానిటేషన్ ఏర్పాట్లు నిర్వహించారు.

# నేడు నెల్లూరుకు పల్లా రాక

: మహానాడు ఏర్పాట్లపై నిర్వహణ కమిటీతో కీలక సమావేశం

**కొడవలూరు,మే 12 ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు నేడు నెల్లూరుకు రానున్నట్లు టీడీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. మహానాడు నిర్వహణ ఏర్పాట్లపై రాచర్లపాడు కిసాన్ సెజ్‌లో బుధవారం ఉదయం జరగనున్న సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొననున్నారని పేర్కొన్నారు. మహానాడును విజయవంతం చేసేందుకు ఏర్పాటు చేసిన నిర్వహణ కమిటీలోని పలువురు మంత్రులు, చైర్మన్‌లు, రాష్ట్ర స్థాయి నేతలు కూడా నెల్లూరుకు చేరుకోనున్నట్లు తెలిపారు. జిల్లాకు చెందిన మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ ముఖ్యనేతలు సమావేశానికి హాజరై ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించనున్నారు. ప్రతినిధుల నమోదు, భోజనాలు, వసతి, రవాణా, వాలంటీర్లు, మీడియా, పారిశుధ్యం, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర అంశాలపై కమిటీలతో ప్రత్యేకంగా చర్చించనున్నట్లు వెల్లడించారు. మహానాడును నిర్వహించే అవకాశం తొలిసారిగా నెల్లూరు జిల్లాకు దక్కడంతో జిల్లా టీడీపీ నేతలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏర్పాట్లలో నిమగ్నమయ్యారని, మహానాడును విజయవంతం చేసేందుకు సమిష్టిగా కృషి చేస్తున్నామని బీద రవిచంద్ర పేర్కొన్నారు.

## రాయితీపై వ్యవసాయ పనిముట్లు

**వింజమూరు, మే 12, ప్రభాతవార్త :** వ్యవసాయ రంగంలో యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వింజమూరు మండల వ్యవసాయాధికారి ఏ.వాసు కోరారు. మంగళవారం ఆయన స్థానిక కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. మండలంలోని అర్హులైన రైతులు తమకు కావాల్సిన యంత్రాల కోసం వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. చిన్న, సన్న కారు రైతులతో పాటు మహిళా రైతులకు ప్రభుత్వం 50 శాతం రాయితీ కల్పిస్తోందని, మిగిలిన రైతులకు 40 శాతం రాయితీ వర్తిస్తుందని ఆయన తెలిపారు. ప్రధానంగావరి గడ్డి కట్టే యంత్రాలు(స్ట్రా బేలర్స్), పవర్ టిల్లర్లు, గొర్రులు, మందులు పిచికారి చేసే వివిధ రకాల స్ప్రేయర్లు వంటి ఆధునిక పరికరాలను ప్రభుత్వం రాయితీపై అందజేస్తోందని వివరించారు. ఆసక్తి గల రైతులు తమ గ్రామ సచివాలయాల్లోని ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఏవో తెలిపారు. దరఖాస్తుతో పాటు ఈ క్రింది పత్రాలను జతచేయాలి. పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్ వన్ బి, ఆధార్ కార్డు, ట్రాక్టర్ అనుసంధానిత యంత్రాల కోసం ట్రాక్టర్ ఆర్‌సీ కాపీ తప్పనిసరి.వచ్చిన దరఖాస్తులను పరిశీలించి లాటరీ పద్ధతిలో లబ్దిదారులను ఎంపిక చేయడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఎంపికైన రైతులకు నేరుగా రాయితీ ప్రయోజనం అందుతుందని, సందేహాలు ఉంటే మండల వ్యవసాయ కార్యాలయాన్ని సంప్ర దించాలని కోరారు.

## విద్యార్థుల మధ్య కనిష్కారెడ్డి పుట్టినరోజు వేడుకలు



**కావలి, మే 12 ప్రభాతవార్త :** కావలి పట్టణ నివాసులు బిజ్జం శ్రీదర్‌రెడ్డి, సాయికారుణ్యరెడ్డి దంపతుల కుమార్తె కనిష్కారెడ్డి రెండవ పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం తుఫాన్ నగర్ లోని సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో చదువుకొంటున్న విద్యార్థులకు విందుబోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి మాట్లాడుతూ బిజ్జం కనిష్కరెడ్డి జన్మదిన వేడుకలను సంయుక్త సేవా సంస్థ విద్యార్థుల మధ్య జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు సురేంద్ర మాట్లాడుతూ జన్మదినం రోజు ఆడంబరాలకు పోకుండా పేద విద్యార్థులకు మంచి విందుబోజనం ఏర్పాటు ఏసిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. జన్మదినం జరుపుకొంటున్న కనిష్కారెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలోదాత బిజ్జం శ్రీధర్‌రెడ్డి, కనిష్కరెడ్డి, కాంట్రాక్టర్ నోటి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్‌లో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం




**కావలి, మే 12 ప్రభాతవార్త :** వైద్యరంగంలో నర్సుల పాత్ర కీలకమైందని రెడ్‌క్రాస్ తలసేమియాడే కేర్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ పాములూరు శ్రీదర్ పేర్కొన్నారు. ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాలలో భాగంగా మంగళవారం నర్సుల దినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తకేంద్రం మరియు తలసేమియా కేంద్రాలలో నర్సులుగా పనిచేసున్న జెవి.శేషమ్మ, పి.వల్లూరమ్మలను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ ఛైర్మెన్ డి.రవిప్రకాష్, వైస్ ఛైర్మెన్ కె.హరినారపరెడ్డి, పాలకమండలి సభ్యులు ఒరుగంటి వెంకటేశ్వర్లు, బెజవాడ ప్రసన్నకుమార్ కార్యదర్శి బిఎస్.ప్రసాద్, జూనియర్ రెడ్‌క్రాస్ కన్వీనర్ జి.హరినాథ్, ఎం.జమున, అగర్వాల్ కంటి వైద్యశాల వైద్యులు డాక్టర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్‌జయంతి



**కావలి, మే 12 ప్రభాతవార్త :** పట్టణంలోని ఒంగోలు బస్టాండు సమీపాన ఉన్న శ్రీ అభయాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం ఘనంగా హనుమ జయంతి మహోత్సవ వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు, అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం శ్రీనివాసచార్యులు భక్తిశ్రద్ధలతో స్వామి జీవిత విశేషాలు గురించి ప్రజలకు వివరించారు.

## మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం

**– 150 మంది బాధితులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ**

**– స్వంత ఖర్చుతో మిల్లెట్స్ పౌడర్ ప్యాకెట్లు అందజేసిన డా.మాధవి**



**నెల్లూరు రూరల్, మే 12, ప్రభాతవార్త :** నెల్లూరు నగరంలోని కొండాయపాలెంలో ఉన్న అబైడింగ్ హోప్ ట్రస్ట్ కార్యాలయంలో మంగళవారం హృదయాలను హత్తుకునే మానవతా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 150 మంది క్యాన్సర్ రోగులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేసి వారి ఆరోగ్యానికి బలాన్ని, జీవితాలకు ఆశాకిరణాన్ని అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ ఆసుపత్రి నెల్లూరు మెడికల్ సూపరింటెండెంట్ డా. మాధవి మాట్లాడుతూ,"క్యాన్సర్ రోగులకు ధ్యానమే ఉత్తమ ఔషధం" అని పేర్కొన్నారు. ధ్యానం ద్వారా మనశ్శాంతి లభించడంతో పాటు ఒత్తిడి తగ్గి, భావోద్వేగ ధైర్యం పెరుగుతుందని, సానుకూల ఆలోచనలు క్యాన్సర్ బాధితుల కోలుకునే ప్రయాణంలో కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. ఆమె ఆప్యాయతతో రోగులతో మమేకమై ధైర్యం నూరిపోశారు. తన సేవాభావాన్ని చాటుతూ డా. మాధవి స్వంత ఖర్చుతో 150 మిల్లెట్స్ పౌడర్ ప్యాకెట్లను కొనుగోలు చేసి ప్రతి క్యాన్సర్ రోగికి స్వయంగా పంపిణీ చేయడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆమె చేసిన ఈ సేవను పలువురు అభినందిస్తూ మానవత్వానికి నిదర్శనమని కొనియాడారు. అబైడింగ్ హోప్ ట్రస్ట్ డైరెక్టర్ డా. ఎం. టైటస్ నిర్మల్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో క్యాన్సర్ బాధితుల సంఖ్య వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో దాతలు, సేవాభావం గల వ్యక్తులు ముందుకు వచ్చి పౌష్టికాహారం, కౌన్సిలింగ్, భావోద్వేగ పరమైన సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. సమిష్టి సేవా కార్యక్రమాల ద్వారా ఎన్నో కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ జయప్రకాశ్, కౌన్సిలర్ కన్యాకుమారి, జాషువా పెట్ల, క్రాంతి, బాబు, జయ, నిర్మల, కుసుమ, మార్తమ్మ, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కొండాయపాలెం-వేదాయపాలెం అండర్‌పాస్‌లకు గ్రీన్ సిగ్నల్‌రైల్వే

## టెండర్లపై సంతోషం వ్యక్తం చేసిన కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి

**నెల్లూరు రూరల్,మే12,ప్రభాతవార్త :** నియోజకవర్గ ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న కొండాయపాలెం మరియు వేదాయపాలెం రైల్వే అండర్‌పాస్‌ల నిర్మాణానికి కీలక ముందడుగు పడింది. ఈ రెండు అండర్‌పాస్‌ల నిర్మాణానికి సంబంధించి రైల్వే శాఖ టెండర్లను పిలవడంతో ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా విజయవాడ రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ ఎస్. శ్రీనివాస్ గారిని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి శాలువాతో సత్కరించి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అండర్‌పాస్‌ల నిర్మాణ పనులు వేగంగా ప్రారంభం కావాలని ఆకాంక్షించిన కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, ఈ ప్రాజెక్టులు పూర్తయితే ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని పేర్కొన్నారు. అలాగే నిర్మాణానికి అవసరమైన స్థలాలకు సంబంధించిన హ్యాండింగ్ ఓవర్ పొజిషన్ పత్రాలను విజయవాడ రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ ఎస్. శ్రీనివాస్ గారికి అందజేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి తెలిపారు. కొండాయపాలెం, వేదాయపాలెం ప్రాంత ప్రజలకు ఈ అండర్‌పాస్‌లు ఎంతో ఉపయోగపడతాయని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

## టిడిపి మహిళా నేతపై అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో వ్యక్తి అరెస్ట్

**నెల్లూరు క్రైమ్ మే 12 ప్రభాతవార్త :** టిడిపి మహిళా నేత పై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు, తన ఛానల్ లో మరికొన్ని అభ్యంతకర విషయాలు ప్రసారం చేస్తానంటూ బ్లాక్ మెయిల్ చేసిన నేపథ్యంలో రమణారెడ్డి అనే వ్యక్తిని బాలాజీ నగర్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు. ఈనెల మూడో తేదీ బాలాజీ నగర్‌లో టిడిపి మహిళా నేత ని అడ్డగించి తనకు నగదు ఇవ్వకపోతే వార్తలు ప్రసారం చేస్తానంటూ యూట్యూబ్ ఛానల్ కు చెందిన రమణారెడ్డి బెదిరించారు. దీనిపై ఆమె ఏడవ తేదీ బాలాజీ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న బాలాజీ నగర్ సీఐ సాంబశివరావు మంగళవారం రమణారెడ్డిని అదుపులోకి తీసుకొని మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. మెజిస్ట్రే ట్ రమణారెడ్డికి రెండు వారాలపాటు రిమాండ్ విధించారు.

## భక్తి శ్రద్ధలతో హనుమజ్జయంతి వేడుకలు



**కలువాయి మే 12 ప్రభాతవార్త :** హనుమజ్జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం వాడవాడల వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని కుల్లూరు శ్రీ ఆరామమారుతి నిలయం అభయ ఆంజనేయస్వామి సన్నిధి నందు వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి నిర్వహించిన కార్యక్రమాలలో భాగంగా సుప్రభాత సేవతో ప్రారంభమై పంచామృతభిషేకం, 108 కలశాలతో 39 అడుగల స్వామి వారి మూల విరాట్‌కు పాలాభిషేకం అదివిధంగా ఆకుపూజ,సహస్రనామార్చన పూజ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. సాయింత్రం వడమాలతోత్సవం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్ధ ప్రసాద అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని మాజీ శాసన మండలి సభ్యులు మాదాసు గంగాధరం, నళినమ్మ దంపతులు, డాక్టర్ కనకాల వెంకటేష్, శిల్పా దంపతులు శ్రీరాఘ్ , మాదాస్ యజ్ఞపవన్ ,అపర్ణ దంపతులు ,శివాలి కుటుంబసభ్యులు ఆద్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. 20 సంవత్సరల క్రితం టిటిడి సహయ సహకారులతో స్వామి వారి ఆలయాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని మాదాసు పేర్కొన్నారు.ఇప్పటి వరకు ప్రతి సంవత్సరం స్వామి వారికి వేడుకగా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని స్వామిని ఆరాధిస్తున్న ఈ ప్రాంత వాసులకు స్వామి వారి ఆశీస్సులు కలగడం ఆనందదాయకమని అన్నారు. సాయింత్రం సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు.ఈ వేడులకలలో నెల్లూరు ఆర్టీసి చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కుమార్తె కైవల్యారెడ్డి, టిడిపి మండల కన్వీనర్ చల్లా రఘురామరెడ్డి, స్వామి వారిని దర్శించుకున్నారు.ఆలయ మర్యాదలతో వారికి వేద పండితులు స్వామి వారి ఆశీర్వచనాలు అందజేశారు.

## మడమనూరులో కార్డన్ సెర్చ్



**మనుబోలు మే 12 ప్రభాతవార్త :** ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని మడమనూరు బిసి కాలనీ లో మంగళవారం పోలీసలు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పొదలకూరు సిఐ వెంకటరావు యువతతో మాట్లాడుతు ప్రతి ఒక్కరు హెల్మట్ ధరించాలి అని మీ ప్రాంతాంలో అనుమానస్పదంగా ఎవ్వరైనా తిరుగుతున్న సమాచారం ఇవ్వాలని ఆన్‌లైన్ మోసాలు ఎక్కువ జరుగుతున్నాయని జాగ్రత్త వహించాలని. మత్తు పదార్థాలకు యువత బానిసలు కావద్దని గంజాయి అమ్మిన కొనుగోలు చేసినా చట్టరిత్యా నేరమని విక్రయాలపై సమాచారం ఇవ్వాలని వాహనాలప దొంగతనలపై నిఘాకోసమే ఈ సెర్చ్అని అన్నారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ శివరాకేష్, వెంకటాచలం ఎస్ఐ ఆంజనేయులు, సిబ్బంది నూనెలక్ష్మయ్యయాదవ్,సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న వాహనాలు అదుపులోకి



**సంగం మే 12 ప్రభాతవార్త** సంగం మండలంలో ఇతర రాష్ట్రాల నుండి చికెన్ వ్యర్థాలను తీసుకొని వస్తున్న రెండు వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. స్థానికులు సమాచారం అందించడం వాహ నాలను గుర్తించి అదుపులోకి తీసుకొన్నారు. మండ లంలో పలు గ్రామాలలో చేవల గుంటలకు చికెన్ వ్యర్థాలను మాఫియా ఇష్టాను సారంగా తరలిస్తున్నారు. వీటిపైన ప్రజలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.

## హెల్మెట్ లేక రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



**మనుబోలు మే 12 ప్రభాతవార్త :** మనుబోలులోని జాతీయ రహదారిపై మోటార్ సైకిల్‌పై నెల్లూరు వైపు వెళుతుండగా ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవార చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు సైదాపురం మండల ఆర్ఆర్‌పురంకు చెందిన కొత్తలూరు కళ్యాణ్ (23) మైన్స్‌లో పని చేస్తున్నాడు. ప్రస్తుతం రాపూరురోడ్డులో నివాసం ఉంటున్నాడు. సైదాపురం నుండి నెల్లూరుకి మోటార్ సైకిల్‌పై బయలుదేరాడు. మనుబోలు బైపాస్‌రోడ్డు వద్ద ఉన్న డివైడర్ ఢీకొని హెల్మట్ లేకపోవడంతో తలకు గాయమై అక్కడిక్కడే మృతి చెందారు. ఎస్ఐ శివరాకేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టు మార్టరం నిమిత్తంగా గూడూరు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళల సమగ్రాభివృద్ధికై ప్రణాళికలు తయారు

**– డిఆర్డీఏ పీడీ నాగరాజ కుమారి**

**నెల్లూరు కలెక్టరేట్, మే 12, ప్రభాతవార్త :** మహిళల సమగ్ర అభివృద్ధికై ప్రణాళికలను సిద్ధం చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డిఆర్డీఏ) ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజకుమారి సూచించారు. మూడవ విడత మోడల్ మండలాలైన అల్లూరు, దగదర్తి, నెల్లూరు, కావలి, పొదలకూరు, కందుకూరు, తోటపల్లి గూడూరు, సంగం రాపూరు, మర్రిపాడు మండలాలకు చెందిన ఏపీఎంలు, సీసీలు, అకౌంటెంట్లకు యాన్యువల్ యాక్షన్ ప్లాన్ (ఏఏపీ)పై ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులను మంగళవారం ఆమె ప్రారంభించారు. డిఆర్డీఏ కార్యాలయం సమావేశ మందిరంలో జరిగిన ఈ శిక్షణ కార్యక్రమంలో నాగరాజకుమారి మాట్లాడుతూ గతంలో మార్పు అంశాలపై సభ్యురాలి కల ఆకల సహకారం పై మూడు దశలుగా శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. తాజాగా ఆ శిక్షణను ఉపయోగించుకొని మార్పు అంశాలపై యాన్యువల్ యాక్షన్ ప్లాన్ రూపొందించాల్సి ఉందన్నారు. మహిళల సమగ్ర అభివృద్ధికై విద్య, ఆరోగ్యం, పారిశుధ్యం, వ్యవసాయం, సుస్థిర జీవనోపాదులు, ఆస్తుల సృష్టి, సామాజిక భద్రత, సామర్థ్యాల పెంపు మొదలైన అంశాలపై ఒక బలమైన కల ఉండాలన్న ప్రాజెక్ట్ డైరెక్టర్ అలాంటి కల ఉన్నప్పుడు ఏ కష్టం వచ్చినా ఎటువంటి అవమానాలు ఎదురైన తన కల కోసం పాటుపడి ఆ కల నెరవేర్చుకోవాలన్నారు. అబ్దుల్ కలాం చెప్పినట్లు కలలు కనాలని ఆ కలలు నెరవేర్చుకునేందుకు ప్రయత్నించాలన్నారు. సంఘ సభ్యులలో కొంతమంది సభ్యులు స్థిరమైన జీవనోపాదులు ఏర్పరచుకొని మంచి ఆదాయం పొందుతున్నారని ఆమె అలాంటివారు కష్టపడి వాళ్ళ కలలను నెరవేర్చుకున్నారన్నారు. ఇతర సభ్యులు కూడా అవకాశాలను అందిపుచ్చుకొని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. ప్రభుత్వ సహాయంతో అందుబాటులో ఉన్న అవకాశాలు ఉపయోగించుకుంటూ ఎలా అభివృద్ధి చెందుతారో అన్న అంశంపై నిర్దిష్టమైన ప్రణాళికలో తయారు చేసుకుని ఆ ప్రణాళికల ద్వారా తమ కలలను నెరవేర్చుకోవాలన్నారు. మోడల్ మండలాలుగా ఎంపిక చేసిన పది మండలాలలోని స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా ప్రాజెక్టు డైరెక్టర్ సిబ్బందికి సూచించారు.

## రైల్వే స్టేషన్‌లో విస్తృత తనిఖీలు ప్రయాణికుల - భద్రతపై పోలీసులు ప్రత్యేక అవగాహన



**నెల్లూరు క్రైం, మే 12, ప్రభాతవార్త:** ఇటీవల గుంటూరు జిల్లా పొన్నూరులో నేరస్తులకు, రైల్వే పోలీసులకు మధ్య జరిగిన దాడి ఘటన నేపథ్యంలో నెల్లూరు రైల్వే స్టేషన్‌లో భద్రతా చర్యలను పోలీసులు మరింత కట్టుదిట్టం చేశారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారమ్‌లలో ప్రయాణికుల భద్రత, రైళ్లలో జరుగుతున్న నేరాల నివారణపై మంగళవారం రైల్వే సిఐ సుధాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నెల్లూరు రైల్వే డిఎస్పి మురళిధర్ సూచనల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో ప్రయాణికులకు తమ సామాను, నగదు, బంగారం వంటి విలువైన వస్తువులను జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. అపరిచిత వ్యక్తులను నమ్మవద్దని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు గమనించిన వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం అందించాలని అవగాహన కల్పించారు. దొంగతనాలు, మాదక ద్రవ్యాల రవాణా మరియు రైలు ప్రయాణాల సమయంలో జరిగే ఇతర నేరాలపై కూడా వివరించారు. అదేవిధంగా జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు సమ్మర్ డ్యూటీ కోసం కేటాయించిన 33 మంది పోలీసు సిబ్బంది, ఆర్మ్డ్ ఫోర్స్ సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్, పరిసర ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. బయటి ప్రాంతాల నుంచి రైల్వే స్టేషన్‌కు చొరబడే గ్యాంగులు, నేరస్తులు తదితర అనుమానాస్పద వ్యక్తుల కదలికలను అరికట్టేందుకు ఆర్‌పీఎఫ్ సిబ్బందితో సమన్వయం చేసుకుని తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికులు అప్రమత్తంగా ఉండి సురక్షితమైన ప్రయాణం కోసం రైల్వే పోలీసులకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రైల్వే ఎస్సై హరి చందన తదితరులు పాల్గొన్నారు.

## మన బడి పిలుస్తోంది కార్యక్రమం




**ఉదయగిరి, మే 12, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి ప్రభుత్వ విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఉదయగిరి దళితవాడ పాఠశాల పరిధిలోని అరుంధతి వాడ నందు ఉదయగిరి మండల విద్యాశాఖ అధికారులు టి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మన బడి పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఇద్దరు విద్యార్థులను వారి గృహంకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి ఇద్దరూ విద్యార్థులను మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఉదయగిరి దళితవాడ పాఠశాలలో చేర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఉదయగిరి దళిత వాడ పాఠశాల ఉపాధ్యాయునీలు షేక్ రజియా బి, టి.సుభాషిణి, ఆర్.జయమ్మ, షేక్ హసీనా, సీఆర్ఎంటీలు తదితరులు పాల్గొన్నారు.

## భర్త మందలించాడని వివాహిత ఆత్మహత్య

**నెల్లూరు క్రైం, మే 12, ప్రభాతవార్త :** కుటుంబ కలహాలు, మనస్తాపంతో ఓ వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన నెల్లూరు రూరల్ మండలం వడ్డిపాళెం గ్రామ పరిధిలోని జగన్ కాలనీలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జగన్ కాలనీకి చెందిన పునబాక సునంద కుమార్తె రాధిక (20)కు, చిత్తూరు జిల్లా పుల్లూరు గ్రామానికి చెందిన చలం జ్ఞానప్రకాష్‌తో రెండేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక బాబు ఉన్నాడు. గతంలో రాధిక వేరొక యువకుడిని ప్రేమించి, పెళ్లయిన ఏడాది తర్వాత అతనితో వెళ్లిపోయింది. అయితే, తిరిగి వచ్చిన ఆమె తన భర్తతోనే కలిసి ఉంటోంది. ఈ క్రమంలో వారం రోజుల క్రితం రాధిక ఫోన్‌కు వస్తున్న మెసేజ్‌లు, కాల్స్ గమనించిన భర్త పద్ధతి మార్చుకోవాలని ఆమెను మందలించాడు. దీనిపై మనస్తాపానికి గురైన రాధిక, ఈ నెల 11వ తేదీ సాయంత్రం తన ఇంట్లోని ఫ్యాన్ హుక్కుకు చీరతో ఉరివేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను నారాయణ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతురాలి తల్లి సునంద ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అంగరంగ వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు





**ఆత్మకూరు, మే12, ప్రభాతవార్త:** ఆత్మకూరు పట్టణంలోని హనుమాన్ జంక్షన్ లోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం అంగరంగవైభవంగా హనుమజ్జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి కుటుంబ సభ్యులతో హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మెన్ కాటంరెడ్డి రవీంద్రారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ నిర్వాహకులు, భక్తులు మంత్రికి ఘనస్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణం జైశ్రీరామ్,జైహనుమాన్ అంటూ మార్మోగింది. మంత్రి రామనారాయణరెడ్డి హనుమా న్‌విగ్రహానికి జలాభిషేకం చేశారు. భక్తుల ఆనందోత్సాహాల మధ్య కన్నులపండుగగా భక్తిపారవశ్యంతో హనుమజ్జయంతి వేడుకలు జరిగాయి. ఆధ్యాత్మికశోభతో హనుమాన్‌జంక్షన్ పరిసరాలు కళకళలాడాయి. ఈ సందర్భంగా భక్తులందరికీ మంత్రి రామనారాయణరెడ్డి అన్నప్రసాదం అందించారు. ఈకార్యక్రమంలో స్థానిక నాయకులు,ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

## పల్లెపాడు- నాగరాజు తోపు శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



**ఇందుకూరుపేట, మే 12, ప్రభాతవార్త :** మండల పరిధిలోని పల్లెపాడు, నాగరాజుతోపు గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థాన ప్రాంగణంలో శ్రీ హనుమాన్ జయంతి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. లోక కళ్యాణార్థం, భక్తుల సౌభాగ్యం కోసం ఈ ఆలయ క్షేత్రంలో శ్రీ ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. విశేష అభిషేకాలు,సిందూర అర్చన ఈ వేడుకల్లో భాగంగా స్వామి వారికి 108 లీటర్ల పాలతో అత్యంత వైభవంగా క్షీరాభిషేకం నిర్వహించనున్నారు. అనంతరం ఆంజనేయస్వామి వారికి అత్యంత ప్రీతికరమైన సహస్రనామ సింధూర రచన భక్తిభావంతో జరగనుంది. మారుతి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోమోగేలా అర్చకులు ఈ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల అనంతరం విచ్చేసిన భక్తీ భక్తాదులందరికి ఆలయ ప్రాంగణంలో భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించి భక్తులు పునీతులు కావాలని నిర్వాహకులు కోరారు. ఈ విశేష పూజా కార్యక్రమాలకు, అన్నదానానికి ఉభయకర్తలుగా శ్రీకొనిజేటి చంద్ర, కుసుమ కుమారి దంపతులు వ్యవహరిస్తున్నారు. వీరి పర్యవేక్షణలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

## రోడ్డుప్రమాదంలో గాయపడ్డ రవిని పరామర్శించిన నల్లపురెడ్డి



**ఇందుకూరుపేట, మే 12, ప్రభాతవార్త :** ఇందుకూరుపేట మండలం కొరుటూరు గ్రామ మాజీ సర్పంచ్ పామంజీ శ్రీనివాసులు సోదరుడి కుమారుడు పామంజి రవి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, వైసీపీ రాష్ట్ర పీఏసీఎస్ సభ్యులు నల్లపురెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి మంగళవారం పుట్టపుపాలెంలోని రవి నివాసానికి వెళ్లి పరా మర్శించారు. యోగక్షేమాలు అడిగి తెలుసు కున్నా రు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## జింకల మృతి వార్తల్లో నిజం లేదు.. అవి క్షేమం

**– అటవీ శాఖ అధికారి ఎస్‌డీ అల్లాఫ్ హుస్సేన్ స్పష్టత**



**ఇందుకూరుపేట, మే 12, ప్రభాతవార్త :** ఇందుకూరుపేట మండలం నిడిముసలి గ్రామ పరిధిలో మామిడి తోపుల్లో సంచరిస్తున్న జింకల విషయంలో వస్తున్న పుకార్లను అటవీ శాఖ అధికారులు కొట్టిపారేశారు. ఈ మేరకు కోదూరు ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ ఎస్‌డీ అల్లాఫ్ హుస్సేన్ మంగళవారం ఘటనా స్థలాన్ని సందర్శించి వాస్తవాలను వెల్లడించారు. గత కొద్ది రోజులుగా నిడుముసలి ప్రాంతంలో జింకలు కనిపించకుండా పోవడంతో కొన్ని పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో జింకల వేట జరిగినట్లు ఒక జింకను వధించినట్లు తప్పుడు వార్తలు ప్రచారమయ్యాయి. ఈ వార్తలపై అల్తాఫ్ హుస్సేన్ స్పందిస్తూ జింకను చంపేశారనే ప్రచారంలో ఏ మాత్రం నిజం లేదు. గ్రామస్తుల భారి నుండి తప్పించుకుని జింకలు పారిపోయాయని వచ్చిన వార్తలు కూడా నిజమే అని స్పష్టం చేశారు. అటవీ శాఖ అధికారుల ఆదేశాల మేరకు గ్రామస్తులు నిరంతరం పర్యవేక్షించగా, ఆ రెండు జింకలు క్షేమంగా ఉన్నట్లు గుర్తించారని ఆయన తెలిపారు. గ్రామస్తులే స్వయంగా ఆ జింకల ఆచూకీ కనుగొని, అవి మామిడి తోటల్లో సురక్షితంగా ఉన్నట్టు ఫొటోలు తీసి అదికారులకు సమాచారం అందించారని ఆయన వెల్లడించారు. వన్య ప్రాణులు ఆరోగ్యంగా, క్షేమంగా ఉన్నాయని ఆయన ధృవీకరించారు. ఈ సందర్భంగా అల్తాఫ్ హుస్సేన్ మాట్లాడుతూ వన్య ప్రాణుల రక్షణ మనందరి బాధ్యత. వేటగాళ్ల నుండి వీధి కుక్కల భారి నుండి ఈ జింకలను కాపాడటంలోఓ గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలి. ఎవరైనా వన్యప్రాణులకు హాని తలపెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జింకల కదలికలను గమనిస్తూ అటవీ శాఖకు సహకరిస్తున్న నిడిముసలి గ్రామస్తులను ఆయన అభినందించారు. ఏదైనా సమాచారం ఉంటే వెంటనే అటవీ శాఖ అధికారులకు తెలియజేయాలని ఆయన కోరారు.

## యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



**ఉదయగిరి, మే 12, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి దిలావర్ భావి వీధిలో మంగళవారం ఐడీఎల్ యూత్ మూవ్ మెంట్ ఆవిష్కరణ దినోత్సవం సందర్భంగా మే 12 రాష్ట్ర వ్యాప్తంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. ఇందులో భాగంగానే మన ఉదయగిరి యూనిట్ నందు జెండా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఐవైఎంఎమ్ రాష్ట్ర సలహా మండలి సభ్యుడు అబ్దుల్ మునాఫ్ మాట్లాడుతూ ఐవైఎంఎమ్ యొక్క ముఖ్య ఉద్దేశం సమాజంలో యువత చెడు వ్యసనాలైన మద్యం, జూదం, అశ్లీలం చెడు కార్యకలాపాలకు దూరంగా ఉండాలని దేశం పట్ల సమాజం పట్ల సోదర భావం సౌభ్రాతృత్వం కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. ఐవైఎంఎమ్ స్థానిక అధ్యక్షులు తారిఖ్ అజీజ్, అదే విధంగా జమా అతె ఇస్లామీ హింద్ నెల్లూరు జిల్లా అధ్యక్షులు ఇస్మా ఇల్, స్థానిక అధ్యక్షులు నస్రుల్లా, సభ్యులు ఎండీ సిద్దిఖ్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బోగోలులో హనుమాన్ జయంతి



**బిట్రగుంట మే12 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన బోగోలులో హనుమాన్ జయంతి సందర్భంగా శ్రీ చెన్నకేశవ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో మంగళవారంఆంజనేయ స్వామికి ఆకు పూజ, సామూహిక సింధూరార్చన, వడమాల సమర్పణ, మంగళహారతి, మహా నైవేద్యం, తీర్థ ప్రసాద వినియోగం వైభవంగా జరిగాయి. ఆలయ ట్రస్టీ బచ్చు కృష్ణ కుమార్ తరపున ఈ కార్యక్రమాలు నిర్వహించారు భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని శ్రీ ఆంజనేయ స్వామి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమానికి సాయి సేవకులు తమ సహాయ సహకారాలు అందించారు.

## జ్ఞాన గుమ్మం.. గ్రంథాలయ శిబిరం!

**కొడవలూరు,మే 12 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కొడవలూరు శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం విద్యార్థులకు జ్ఞాన గుమ్మంలా మారింది. స్థానిక లైబ్రేరియన్ కె. రాజేశ్వరి ఆధ్వర్యంలో మంగళవారం ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. ఈ సందర్భంగా శిబిరానికి హాజరైన విద్యా ర్థుల చేత ముందుగా గ్రంథాలయ ప్రతిజ్ఞ చేయించి, అనంతరం పుస్తక పఠనం చేయించారు. విద్యార్థుల్లో నైతిక విలువలు, స్ఫూర్తిని పెంపొందించేందుకు ల్యాప్టాప్ ద్వారా నీతి కథలు మరియు మోటివేషన్ స్టోరీలను ప్రదర్శించారు. కాగా, ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.రాజశేఖర్ పాల్గొని గ్రంథాలయ సభ్యత్వం తీసుకున్నారు. వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకవాలని,ప్రతి ఒక్కరూ గ్రంథాలయంలో సభ్యులుగా చేరాలని లైబ్రేరియన్ రాజేశ్వరి ఈ సందర్భంగా కోరారు.



## ప్రజల ముంగిటకే పాలన.. సమస్యల పరిష్కారమే లక్ష్యం!

**విడవలూరు, మే 12 ప్రభాతవార్త :** మండలంలోని అలగానిపాడు గ్రామంలో "నెలకో గ్రామం నాలుగు సందర్శనలు" కార్యక్రమంలో భాగంగా రెండో విడత గ్రామసభ మంగళవారం తహశీల్దార్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు గ్రామస్థులతో కలిసి క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించారు. గత పర్యటనలో ప్రజల నుంచి వచ్చిన అర్జీల పురోగతిని సమీక్షించడంతో పాటు, కొత్తగా ఎదురవుతున్న సమస్యలపై ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ.. ప్రతి సమస్యను పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలందించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ ఐ అబ్దుల్ సలాం, వీఆర్వో లక్ష్మీ, సచివాలయ సిబ్బంది, రైతులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## విడవలూరులో వేసవి విజ్ఞాన శిబిరం

**విడవలూరు, మే 12 ప్రభాతవార్త :** విడవలూరు శాఖ గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కథలు చెప్పడం, కథలు చదవడం వంటి పలు సృజనాత్మక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ నిరూప మాట్లాడుతూ.శాఖగ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలకు గ్రామ ప్రజలు తమ పిల్లలను సకాలంలో పంపించి, వారి ఉన్నత భవిష్యత్తుకు తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



## అపర్ణను ఆదర్శంగా తీసుకోవాలి

**కోవూరు, మే 12 ప్రభాతవార్త :** కోవూరు మండలం గుమ్మలదిబ్బ ఉన్నత పాఠశాలలో ఇటీవల పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం, కోవూరు నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన సాయి అపర్ణను హిందీ ఉపాధ్యాయులు ఇలియాజ్, సతీమణి శైల శ్రీదేవిలు అపర్ణ ఇంటికి వచ్చి ప్రత్యేకంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ గ్రామంలో ఎటువంటి తర్ఫీదు లేకపోయినా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఇచ్చిన ప్రోత్సాహం, అమ్మమ్మ చొరవతో ఇంత మంచి స్థానం సంపాదించిన అపర్ణను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఇదే స్ఫూర్తిని నిరంతరం కొనసాగించాలని అపర్ణకు సూచించారు. అనంతరం విద్యార్థినికి రూ. 10 వేలు పారితోషకం తమవంతుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లికార్జున తదితరులు ఉన్నారు.



## 250 వెండి డాలర్లు పంపిణీ

**కోవూరు, మే 12 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో 250 వెండి డాలర్లు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో అంకెం సుబ్రహ్మణ్యం మిత్ర బృందం సహకారంతో చిన్నారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా హనుమజ్జయంతి ఉత్సవాలు భక్తుల సహకారంతో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయన్నారు. మంగళవారం చిన్నారులకు ఈ వెండి డాలర్లు పంపిణీ చేసిన అంకెం సుబ్రహ్మణ్యం మిత్ర బృందం సభ్యులకు ప్రత్యేకంగా ఆ స్వామివారి కరుణా కటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని ఆశీర్వదిస్తున్నామన్నారు. ఈ తొమ్మిది రోజుల పాటు ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన దాతలు, భక్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు సుబ్బయ్య స్వామి,నందకిషోర్ స్వామి, ఫణీంద్ర స్వామి, , భక్తులు ఉన్నారు.



## వైభవంగా హనుమత్ గాయత్రి హోమం

**కోవూరు, మే 12 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమత్ జయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయంలో ప్రాతఃకాలమునే స్వామివారికి శుప్రభాతం, పంచామృతస్నపన, సహస్రనామార్చన, కార్యక్రమాలను సాంప్రదాయబద్ధంగా ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో చేపట్టారు. అనంతరం హనుమత్ గాయత్రి హోమాన్ని రుత్వికులు శ్రీకాంతాచార్యుల ఆధ్వర్యంలోభక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా హనుమాన్ చాలీసా భక్తబృందం వ్యవహరించారు. ఈ సందర్భంగా స్వామివారికి 11 రకాల పండ్ల రసాలతో మహా అభిషేక కార్యక్రమాలను కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు సుబ్బయ్య స్వామి,నందకిషోర్ స్వామి, ఫణీంద్ర స్వామి, శేఖర్ స్వామి, భక్తులు ఉన్నారు.



## ఘనంగా గ్రామోత్సవం

**కోవూరు, మే 12 ప్రభాతవార్త :** హనుమత్ జయంతి ముగింపు ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామివారు ఒంటె వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి పూల ంగి సేవ,పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా చేప ట్టారు. స్వామివారి గర్భాలయాన్ని అత్యంత వైభవంగా పుష్పాలతో అలంకరి ంచా రు. అనంతరం స్వామివారు కన్నులపండువగా గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ పర్వదినం సందర్భంగా స్వామివారిని కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి, ట్రైనీ డీఎస్పీ శివప్రియ, కోవూరు తహసీల్దార్ నిర్మలానందబాబా, మనుబోలు తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్యలు సందర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. గ్రామోత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు.



## వేసవి విజ్ఞాన శిబిరంలో డాన్సు క్లాసులు

**కోవూరు, మే12 ప్రభాతవార్త :** కోవూరులోని పచ్చిపాల శంకర్‌రెడ్డి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో మంగళవారం జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు చలపతి ఆధ్వర్యంలో డ్యాన్స్ మాస్టర్ నారాయణరావు పర్యవేక్షణలో పాల్గొన్న చిన్నారులకు డ్యాన్స్ క్లాసులపై బేసిక్స్ గురించి అవగాహన కల్పించి డ్యాన్స్‌లు ఏ విధంగా నేర్చుకోవాలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ సురేంద్రరెడ్డి మాట్లాడుతూ ఈ వేసవి విజ్ఞాన శిబిరంలో చిన్నారులు పాల్గొని దీనిని పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రంగారెడ్డి, రహంతుల్లా , భాస్కర్‌రావు, తదితరులు ఉన్నారు.



## దైవ సంకల్పంతో శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణం

**- హనుమాన్ జయంతి సందర్భంగా తోటపల్లిలో ఆధ్యాత్మిక వైభవం**

**తోటపల్లి గూడూరు, మే 12, ప్రభాతవార్త:** సర్వేపల్లి నియోజకవర్గం తోటపల్లి గూడూరు మండలం తోటపల్లి గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ముగింపు కార్యక్రమం మంగళవారం ఆధ్యాత్మిక వైభవంతో కొనసాగింది. మాజీ సర్పంచ్, ఆంజనేయ స్వామి భక్తుడు కోసూరు నారాయణ మీడియాతో మాట్లాడుతూ ఆలయ నిర్మాణం వెనుక ఉన్న దైవ సంకల్పాన్ని వివరించారు. గ్రామ దొరువులో లభించిన ఆంజనేయ స్వామి విగ్రహమే ఈ ఆలయ నిర్మాణానికి ప్రేరణగా మారిందని తెలిపారు. అప్పటి నుంచే తమ కుటుంబానికి ఈ ప్రాంతంలో ఆలయం నిర్మించి స్వామివారిని ప్రతిష్టించాలనే సంకల్పం ఏర్పడిందని, తన తండ్రి ఆశయం కూడా ఇదేనని భావోద్వేగంగా వెల్లడించారు. మూడు రోజులపాటు నిర్వహించిన విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయి. వేద మంత్రోచ్చారణలు, ప్రత్యేక పూజలు, హోమాలు, అన్నదాన కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. గ్రామ ప్రజలు, భక్తులు, దాతలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమ విజయవంతానికి సహకరించారు. దైవ అనుగ్రహం, గ్రామస్థుల ఐక్యత వల్లే ఆలయ నిర్మాణం పూర్తైందని నిర్వాహకులు తెలిపారు. ఇదిలా ఉండగా హనుమ జయంతి సందర్భంగా మండలంలోని పలు ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజనలు, అన్నదాన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తోటపల్లి గ్రామంలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయి ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.



## మేత ధరల పెంపుతో ఆక్వా రైతుల్లో ఆందోళనఇలా అయితే సాగు చేయడం కష్టమే

**- ఆక్వా రైతు పామంజి రామకృష్ణ ఆవేదన**

**తోటపల్లి గూడూరు, మే 12, ప్రభాతవార్త:** రొయ్యల మేత ధరలను మరోసారి పెంచనున్నారనే వార్తలతో తోటపల్లి గూడూరు మండలంలోని ఆక్వా రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఇప్పటికే సాగు ఖర్చులు పెరిగి, మార్కెట్‌లో రొయ్యలకు సరైన ధరలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో మేత ధరల పెంపు రైతులపై మరింత భారం మోపుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువుల నిర్వహణ నుంచి మందులు, విద్యుత్, కూలీల ఖర్చులు వరకు అన్నీ పెరుగుతుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆక్వా రైతు పామంజి రామకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం ఆక్వా రంగం పూర్తిగా సంక్షోభంలో ఉంది. వైరస్ ప్రభావం, దిగుబడుల తగ్గుదల, మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లేక రైతులు ఇప్పటికే నష్టాల్లో ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మేత ధరలు మళ్లీ పెంచడం రైతులను మరింత ఇబ్బందులకు గురి చేస్తోంది. ఒక చెరువుకు సీజన్ మొత్తం లక్షల రూపాయలు మేతకే ఖర్చవుతోంది. ఇప్పుడు ధరలు పెరిగితే సాగు కొనసాగించడం చాలా కష్టమవుతుంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. ముడిసరుకుల ధరలు పెరిగాయని కంపెనీలు చెబుతున్నప్పటికీ, గతంలో ధరలు తగ్గినప్పుడు మేత ధరలను తగ్గించలేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. యుద్ధ పరిస్థితులు, దిగుమతి సమస్యలు పేరుతో రైతులపై అదనపు భారం మోపడం సరికాదని మండిపడుతున్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని మేత ధరల పెంపును అడ్డుకోవాలని, ఆక్వా రైతులను ఆదుకునే చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



## తిన్నెలపూడిలో బడి పిలుస్తోంది

కోట, మే 12 ప్రభాతవార్త :కోట మండలం తిన్నెలపూడి గ్రామంలో మంగళవారం బడి పిలుస్తోంది కార్యక్రమంలో ఎంఇఒ-1 శిరీష పాల్గొన్నారు. గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్నారని చెప్పారు. తల్లికి వందనం, మధ్యాహ్న భోజనం, ఉచితంగా పాఠ్య పుస్తకాలు, బూట్లు, ఏకరూప దుస్తులు, ఆంగ్ల మాధ్యమ బోధన జరుగుతుందని తెలిపారు. ఆ మేరకు పదిమందిని పాఠశాలలో మంగళవారం చేర్పించామని ఎంఇఒ -1 శిరీష తెలిపారు. ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన అందిస్తున్నట్లు వివరించారు.




## పది తప్పిన విద్యార్థులకు తర్ఫీదు

**కోట, మే 12 ప్రభాతవార్త :** ఇటీవల విడుదల చేసిన 10వ తరగతి పరీక్షల ఫలితాల్లో ఫెయిలైన విద్యార్థులపై విద్యా శాఖ ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఆ మేరకు కోటలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. 45 మంది విద్యార్థులు ప్రతిరోజు తరగతులకు హాజరవుతున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి చెప్పారు. ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు విద్యార్థులకు రోజువారీ తరగతులను ప్రణాళికాబద్ధంగా ఉదయం 8 నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తున్నారు.ఈ నెల 25వ తేదీ నుంచి 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమవుతాయని ఎంఇఒ-2 మస్తానయ్య తెలిపారు.



## ఎన్‌బికెఆర్‌లో ప్రశాంతంగా ఈఏపీసెట్

**కోట, మే 12 ప్రభాతవార్త :** ఇంజినీరింగ్ విద్యలో చేరేందుకు అర్హత పరీక్ష ఈఏపీ సెట్ ప్రభుత్వం నిర్వహిస్తుంది. కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకు విడతలవారీగా పరీక్షలు నిర్వహిస్తారు. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మశీలో చేరేందుకు కామన్ ఎంట్రెన్స్ టెస్ట్‌ను జెఎన్‌టియు నిర్వహిస్తోంది. పోలీసు బందోబస్తు మధ్య విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతి లేకపోవడంతో అర్ధగంట ముందుగానే పరీక్ష కేంద్రానికి విద్యార్థులు చేరుకుంటున్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు రెండు సెషన్స్‌లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

## సాగుదారుడికే యూరియా కార్డు

**కోట, మే 12 ప్రభాతవార్త :** ఇప్పటివరకు రైతులకు ఎరువులను పట్టాదారు పాస్ పుస్తకాల ఆధారంగా ఇచ్చేవారు. ఇకపై అవి పక్కదారి పట్టకుండా, అర్హులు నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అందులో భాగంగా కార్డు విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ ఖరీఫ్ నుంచి వీటిని అన్నదాతలకు అందజేయనుంది. పంటలు సాగు చేస్తున్నట్లు రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకున్న వారికి ఈ కార్డులు ఇస్తారు. ఇందులో ఏ పంటకు ఎంత ఎరువు వాడాలో వివరాలు ఉంటాయి. కర్షకులు కార్డుతో రైతు సేవా కేంద్రానికి, పిఎసిఎస్, ప్రైవేటు డీలర్ల వద్దకు వెళ్లి పొందాల్సి ఉంటుంది. ఒక్కో రైతుకు ఒక్క కార్డు మాత్రమే ఇస్తారు.దుర్వినియోగానికి అడ్డుకట్ట వరి సాగులో యూరియా వినియోగాన్ని నియంత్రించడంతో పాటు దుర్వినియోగానికి అరికట్టేందుకు ప్రభుత్వం కొత్త విధానానికి శ్రీకారంచుట్టింది. వచ్చే ఖరీఫ్ నుంచి ఏపీఏఐఎఫ్ఎస్ (ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఇంటిగ్రేటెడ్ మేనేజ్‌మెంట్ సిస్టం) యాప్‌లో నమోదు తర్వాత మాత్రమే సాగుదారుడికి యూరియా అందిస్తారని కోట మండల వ్యవసాయాధికారి సుచేంద్రప్రసాద్ తెలిపారు.

## మురుగు నీరు తొలగించరా!

**బిట్రగుంట మే 12 ప్రభాతవార్త :** బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీలోని రామస్వామి పాలెం గ్రామంలో అంబేద్కర్ నగర్ కాలనీలో మురుగునీరు తొలగించకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెలల తరబడి కాలువలు శుభ్రం చేయకపోవడంతో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తూ ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా ఉంది. తక్షణమే పంచాయతీ అధికారులు స్పందించి మురుగునీరు సక్రమంగా వెళ్లేలా చర్యలు తీసుకోవడంతో పాటు ఈ ప్రాంతంలో వీధి దీపాలు కూడా వెలిగేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



## జలదంకిలో పోలీస్ కార్డెన్ సర్చ్

**జలదంకి,మే12,ప్రభాతవార్త:**మండల కేంద్రమైన జలదంకిలో మంగళవారం పోలీసులు కార్డెన్ సర్చ్ నిర్వహించారు.స్థానిక ఎస్‌సి కాలనీలో చేపట్టిన ఈసర్చిలో కాలనీలోని ప్రతి నివాసాన్ని తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 52 ద్విచక్ర వాహనాలు,6 ఆటోలను సీజ్ చేశారు.ఈసందర్భంగ కలిగిరి సిఐ సుబ్బా రావు ప్రజలకు అవగాహన కల్పించారు.రోడ్ బధ్రత చర్యల్లో భాగంగ ప్రతి ఒక్క వాహనదారుడు హెల్మెట్ తప్పని సరిగ దరించి ప్రయాణించాలన్నారు.అదే సమయంలో సరైన పత్రాలు కలిగి వుండాలని స్పష్టం చేశాడు.మద్యం సేవించి డ్రైవ్ చేయకూడదని చెప్పారు.అలాగే వాహనాలు నడిపే సందర్భంలో సెల్ ఫోన్లు మాట్లాడ కూడదని బండి ప్రక్కన పార్కింగ్ చేసి ఎంతసేపు మాట్లాడిన ఇబ్బంది వుండదన్నారు. అనుమానాస్పద వ్యక్తులు ఎవరైన సంచరిస్తుంటే సమాచార మివ్వాలని ఆయన సూసించారు .సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగ వుంచడం జరుగుతుందన్నారు జిల్ల.ఎస్‌పి ఆదేశాల ప్రకారం ఈకార్డెన్ సర్చె చేశామని కార్య క్రమంలో సర్కిల్ పరిదిలోని సిబ్బంది పాల్గొన్నట్లు ఆయన వివరించాడు.



**శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానము**

కలవకొండ గ్రామం, చిల్లకూరు మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

ప్రకటన నెం.04/2026 తేది: 07.05.2026

**మెట్ట భూములు - సిలికా స్టాకు యార్డు క్రింద గాని / మెట్ట పంటలుకు గాని లైసెన్సు కొరకు సీల్డు టెండరు / బహిరంగ వేలం ప్రకటన**

ఇందు మూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా పై దేవస్థానమునకు హక్కు అనుభవము కలిగియున్న ఈ క్రింది షెడ్యూల్ దాఖల మెట్ట భూములను తేది 01-07-2026 నుండి 30-06-2031 వరకు అనగా '5' సంవత్సరాల కాలపరిమితి మరియు 2026-2027 వరకు అనగా 1 సంవత్సరం పాటు దేవస్థానము నందు క్లాత్ పందిళ్ళు మరియు హైరర్స్ వగైరాలు నిర్వహించుకొను లైసెన్సు హక్కుకు సీల్డ్ టెండర్లు మరియు బహిరంగ వేలంపాట పై దేవస్థానము వద్ద తేది 19-05-2026 న ఉదయం 10:30 ని॥లకు జరుగును. టెండర్ షెడ్యూల్ కొరకు రూ.200/-లు చెల్లించి ప్రకటన కటన తేది నుండి తేది 18-05-2026 సాయంత్రం 5-00 గం॥వరకు పై దేవస్థాన కార్యాలయము నందు పొందవచ్చును. ధరావత్తుతో పాటు టెండరు షెడ్యూలు తేది 19-05-2026న ఉదయం 10-00 గం॥లోపు టెండరు బాక్స్ నందు వేయవలెను. అదే రోజు వేలంపాట పూర్తి అయిన తుదుపరి టెండరు బాక్స్ దేవదాయ శాఖ అధికారుల మరియు హాజరైన టెండరుదారులు సమక్షములో తెరవబడును. ఈ క్రింది లైసెన్సు హక్కులకు పాట తెగిన వెంటనే ధరవత్తుతో కలుపుకొని 1 సం॥ హెచ్చుపాట మొత్తం వెంటనే చెల్లించవలెను. తదుపరి ఆమోదము కొరకు ఉన్నతాధికారులకు పంపబడును.

**1. భూముల వివరములు :-**

| ప్లాట్ నెం. | సర్వే నెం. | విస్తీర్ణం | కాల పరిమితి | ధరావత్తు | |
|---|---|---|---|---|---|
| | | | | సిలికా యార్డు | మెట్ట పంటలు |
| 1 | 92/3 | 2-17 | తేది. 01.07.2026 నుండి 30.06.2031 వరకు అనగా '5' సంవత్సరాలు | రూ. 1,00,000/- | రూ. 50,000/- |
| 2 | 92/3 | 5-15 | | రూ. 1,00,000/- | రూ. 50,000/- |

**క్లాత్ పందిళ్ళు మరియు హైరర్స్ వివరములు :-**

| వ.నెం. | వివరములు | కాల పరిమితి | ధరావత్తు |
|---|---|---|---|
| 1 | దేవస్థానము నందు క్లాత్ పందిళ్ళు మరియు హైరర్స్ వగైరాలు నిర్వహించుకొను లైసెన్సు హక్కు | 2026-2027 వరకు (1 సంవత్సరం) | రూ. 10,000/- |

పై టెండరు షరతుల కొరకు టెండరు సమయములో కాని ముందుగా గాని పై దేవస్థానము నందు తెలుసుకొనవచ్చును. వివరములకొరకు నెం. 7981294396 ను సంప్రదించగలరు.

యం.రవి క్రిష్ణ, కార్యనిర్వాహణాధికారి   కందల అర్చన చైర్మన్ మరియు ధర్మకర్త మండలి

## పల్లమాల అంగన్వాడీ కేంద్రానికి చేయూత

**- అంగన్వాడీ కేంద్రానికి విద్యా సామాగ్రి, హోమియో మందులు పంపిణీ**

**చిల్లకూరు, మే 12, ప్రభాతవార్త :** మండలంలోని పల్లమాల గ్రామానికి చెందిన గూడూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కేంద్రానికి అవసరమైన విద్యా సామాగ్రి, వేసవి కాలంలో వచ్చే సీజనల్ వ్యాధులకు అవసరమైన ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా హోమియో మందు లను మంగళవారం హనుమ జయంతిని పురస్కరించుకొని కోట మండలం చెందోడు గ్రామానికి చెందిన ఎం.వి.రావు ఫౌండేషన్ నిర్వాహకులు పంపిణీ చేశారు. అంగన్వాడీ కేంద్రంలోని ఉపాధ్యాయిని,సహాయకురాలు విజ్ఞప్తి మేరకు అంగన్వాడి కేంద్రానికి అవసరమైన చాపలు విద్యా సామా గ్రిని అందించడమే కాకుండా, ఆ కేంద్రంలో విద్యను అభ్యసించే చిన్నారులకు, గ్రామస్తులకు చికెన్ ఫాక్స్, ఇతర వేసవి కాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు శోకకుండా ముందస్తు జాగ్రత్త చర్యలో భాగంగా హోమియో మందులను అందరికీ పంపిణీ చేశారు. హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రసాదాన్ని స్థానికులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంవి రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ, కార్యదర్శి ఎం విజయలక్ష్మి, పల్లమాల అంగన్వాడి కేంద్రం ఉపాధ్యాయిని, సహాయకురాలు, గ్రామస్తులు, చిన్నారులు పాల్గొన్నారు.



**పాస్‌పోర్ట్ పోయినది**

నేను, షేక్ ఖదర్ బాషా, తండ్రి పేరు ఎస్.కె. మభు సాహెబ్, నివాసం శ్రీరామపురం, కసుమూరు గ్రామం, వెంకటాచలం మండలం, ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-524320. నా పాస్‌పోర్ట్ నంబర్ L1260167 ను కసుమూరు గ్రామంలో జెరాక్స్ తీసుకోవడానికి వెళ్తున్న సమయంలో పోగొట్టుకున్నాను. చాలా వెతికినా అది దొరకలేదు. ఎవరైనా ఈ పాస్‌పోర్ట్‌ను కనుగొంటే, దయచేసి పై పేర్కొన్న చిరునామాకు తెలియజేయగలరు.

Cell No: +91 91336 00292

## నర్సుల సేవలు అభినందనీయం

**గూడూరు, మే 12, ప్రభాతవార్త :** పట్టణంలోని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసు పత్రిలో ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళ వారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.రో గుల పట్ల కంటికి రెప్పలా ఉంటూ సేవలు అందిస్తున్న నర్సుల కృషిని గుర్తిస్తూ, ఈ సందర్భంగా ఐదు గురు నర్సులను ఘనంగా సత్కరించారు. ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ మనం అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్ళినప్పుడు వైద్యులతో సమానంగా, తల్లిలా మనల్ని ఆదరించి సేవలు చేసేది నర్సులే అని కొనియాడారు. ముఖ్యంగా కరోనా వంటి కష్టకాలంలో తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి, కుటుంబాలకు దూరంగా ఉండి ప్రజల ప్రాణాలను కాపాడిన వీరి సేవలు వెలకట్టలేనివి అన్నారు. హాస్పిటల్ సూపర్డెంట్ షరీనా, హాస్పిటల్స్ సిబ్బంది, ప్రగతి సేవా సంస్థ సభ్యులు, వాకాటి రామ్మోహన్, వెంకట్, సంచి ముని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## 10వ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులకు అవార్డులు

**అనంతసాగరం,మే12,ప్రభాతవార్త:** రేవూరు బిసి సంక్షేమ వసతిగృహ విద్యార్థులు 10వ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభకనపరచిన ఆర్.ప్రణీత 589, ఒ.కావ్య 583 మార్కులు సాధించారు. మంగళవారం విజయ వాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన బిసి వసతిగృహాల్లో 10వ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థుల అభినందన సభ నిర్వహించారు. రాష్ట్ర బిసి సంక్షేమ శాఖామంత్రి ఎస్.సవిత చేతుల మీదుగావిద్యార్థులు అవార్డులు, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. రేవూరు బిసి సంక్షేమా ధికారి మల్లీశ్వరి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి బిసి సంక్షేమంలో రేవూరు రెండవ స్థానం వచ్చిందని అలాగే జిల్లాస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ అవార్డులు వచ్చాయన్నారు. ఈసందర్భంగా విద్యా ర్థులను అభినందించారు.



## గొల్లపల్లిలో కిశోర వికాసం

**- పోషకాహారంపై అవగాహన - ఆత్మకూరు సీడీపీవో సునీలత**

**చేజర్ల, మే 12, ప్రభాతవార్త :** చేజర్ల మండలం గొల్లపల్లి గిరిజన కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోరి వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆత్మకూరు సీడీపీవో సునీలత ముఖ్య అతిథిగా హాజరై అనం తరం ఆమె మాట్లాడుతూ 11 నుంచి 18 సంవత్సరాల లోపు వయస్సు గల కిశోర బాలికలు అందరూ వారు ఎదుర్కొనే ఇబ్బందులను మరి ఏమైనా ఇతర సమస్యలు ఉంటే వారి అభిప్రాయాలను రాతపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. రాత పూర్వకంగా తెలియజేసిన వారి అభిప్రాయాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కిశోర బాలికల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించడం, బాల్య వివాహాల నివారణ, పోషకాహారం ప్రాధాన్యత వంటి అంశాలపై వారికి వివరించారు. కిశోర బాలికలు రక్తహీనత భారిన పడకుండా ఉండాలంటే ప్రతి రోజు పోషక విలువలు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఆకు కూరలు, పప్పు ధాన్యాలు, గుడ్లు, పాలు, పండ్లు వంటి పోషకాహారాన్ని అలవాటు చేసుకోవాలని తెలిపారు. ప్రతి బాలిక కూడా క్రమం తప్పకుండా రక్త పరీక్షలు చేయించుకొని ఆరోగ్య పరిస్థితిని పరిశీలించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సేవల గురించి కూడా అవగాహన కల్పించారు. బాలికలను ఎవరైనా వేదించినా, ఇబ్బందులకు గురి చేసినా వెంటనే 1098 నంబర్‌కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని వివరించారు. బాలల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అలాగే 18 సంవత్సరాల లోపు వయస్సు గల బాలికలకు బాల్య వివాహాలు చేయడం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు బాల్య వివాహాలకు పాల్పడకుండా జాగ్రత్త పడాలని, చట్టాన్ని ఉల్లంఘించినట్లయితే సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలికలు విద్యతో పాటు ఆరోగ్యంపై కూడా శ్రద్ధ పెట్టాలని సూచించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఎంఇఒకి వినతి పత్రం అందజేసిన అపస్మానేతలు

**బుచ్చి మే 12 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం అపస్మా సభ్యులు మంగళవారం ఎంఇఒని కలిసి బడిబాటలో ప్రవేటు పాఠశాల విద్యార్థుల పేర్లను వారికి తెలియజేయకుండా వారే ప్రధానోపాధ్యాయులలాగిన్ నుండి పేర్లను తీసివేయడం సైబర్ నేరం కిందకు వస్తుందని తెలియజేశారు. తల్లిదండ్రులఇష్టపూర్వకంగా ప్రవేటు పాఠశాలలు వారి బకాయిలను పూర్తి చేసి వారికి నచ్చిన చోట చేరవచ్చు .ఈవిషయంలో మండల విద్యా శాఖాదికారి ప్రవేటు పాఠశాలలకు న్యాయం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో కోవూరు నియోజకర్గం అపస్మా అధ్యక్షు రామసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షులు శ్రీదర్,కార్యదర్శి మల్లేశ్వర్‌రెడ్డి, మంజు,అయుభఖాన్, కరస్పాండెంట్స్ పాల్గొన్నారు.



## ఎమ్మెల్యేచే ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



**గూడూరు, మే 12, ప్రభాతవార్త** హనుమాన్ జయంతి సందర్భంగా గూడూరు పట్టణంలోని విఘ్నేశ్వరపురం వద్ద ఉన్న ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ఆంజనేయ స్వామికి అభిషేకం నిర్వహించారు. అలాగే పురిటి పాలెం సమీపంలో ఉన్న ఆంజనేయ స్వామి దేవస్థానంలో పూజలు నిర్వహించారు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేని ఘనంగా సన్మానించారు. అదే విధంగా పట్టణ సమీపంలోని ఇందిరమ్మ కాలనీ సునీల్ కుమార్ నగర్‌లో ఉన్న శ్రీ కార్యాసిద్ధి ఆంజనేయ స్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆంజనేయ స్వామి వారికి విశేష అలంకరణ అభిషేకం హోమం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. నిర్వాహకులు వాటంబేడు శివకుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



**సైదాపురం, మే 12, ప్రభాతవార్త** మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వ హించారు.మండల కేంద్రమైన సై దాపురంలోని పడమటి వీధిలో ఉన్న వీరాంజనేయ స్వామి ఆలయంలోగ్రామస్తులు ఆధ్వర్యంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు.ఉదయం స్వామివారికి పంచామృతంతో అభిషేకకార్యక్రమాలు నిర్వహించారు.పాలూరుమస్తానయ్య, గ్రామస్తులు ఆధ్వర్యంలోఅన్నదాన కార్యక్రమం చేపట్టారు. అనంతరం సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు.

## ఎమ్మెల్యేచే పొజిషన్ సర్టిఫికెట్లు అందచేత



**గూడూరు, మే 12, ప్రభాతవార్త** గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సొంత నివేశ స్థలం ఉండి కాలనీ ఇల్లు కట్టుకోడానికి నమోదు చేసుకున్న 50 మంది పేదలకు ఇంటి పొజిషన్ సర్టిఫికెట్‌ను గూడూరు ఎమ్మెల్యే పాశింసునీల్ కుమార్ అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల అభ్యునతే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతి ఒక్కరు సొంత ఇంటిని కల్గి ఉండాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను తీసువచ్చాయని, అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## మహానాడును దిగ్విజయం చేయండి!

### :టీడీపీ నేతల పిలుపు..



**కొడవలూరు, మే 12 ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా రేగడిచెలికలోని ఇఫ్కో కిసాన్ సెజ్లో నిర్వహించనున్న తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని కొడవలూరు మండల టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని షాదీ మంజిల్ నందు వారు మీడియా సమావేశం నిర్వహించారు.**ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..** కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సారథ్యంలో జరుగుతున్న ఈ మహానాడును జయప్రదం చేసేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని కోరారు. మండలం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చి తెలుగుజాతి పండుగను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.మండల పార్టీ అధ్యక్షులు నాపా వెంకటేశ్వర్లు నాయుడు, కరకటమల్లికార్జున, కోవూరు నియోజకవర్గ రైతు అధ్యక్షులు పల్లంరెడ్డి సురేష్ రెడ్డి, సొసైటీ ఛైర్మన్లు వినీల్ రెడ్డి, వంశీధర్ రెడ్డి, కోవూరు వెంకీ, పంది శ్రీనివాసులు,షేక్ జిలాని భాష,భాషి, నవాజ్ తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 14న లీలామహల్ పునఃప్రారంభం



**నెల్లూరు, మే 12, ప్రభాతవార్త-విద్య** గత 75 సంవత్సరాలుగా సింహపురి వాసులకు వినోదాన్ని అందించిన లీలామహల్ సరికొత్త హంగులు సంతరించుకని 14న పునఃప్రారంభించేందుకు సిద్ధంగా ఉందని హాల్ నిర్వాహకులు మాగుంట ఆదిత్యారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని స్దానిక లీలామహా ల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిత్యారెడ్డి మా ట్లాడుతు మెట్రొ, మహా నగరాలకు ధీటుగా ప్రేక్షకులకు సౌకర్యవంతమైన , విలా సవంతమైన అనుభూతిని కలిగించేందుకు తాము ఎంతగానో శ్రమించా మన్నారు. అత్యాధునిక టెక్నాలజీ కలిగిన అతిపెద్ద స్క్రీన్, ప్రేక్షకులు సౌకర్య వంతంగా కూర్చుని చూసేందుకు వీలుగా దిగుమతి చేసుకున్న రిక్లైనర్ సోఫాలు, విలాస వంతమైన లైటింగ్స్ తో హాల్‌ను అత్యంత సుందరంగా తీర్చి దిద్దటం జరిగిందన్నారు. ఈనెల 14న హీరో సూర్య నటించిన వీరభ్రధుడు సిసిమాతో లీలామహాల్‌ను పునఃప్రారంభించటం సంతోషంగా ఉందన్నారు. ఇందులో టిక్కెట్‌ధర రూ.250 , జిఎస్టీగా ఉందని, ఐదు షోలకు తమకు అనుమతి ఉందన్నారు. జిల్లాలోని సినీ ప్రేక్షకులు అందరూ తమను ఆదరించాలని ఆయనకోరారు. ఈకార్యక్రమంలోనిర్వాహకులు పాల్గొన్నారు.

## హంసవాహనంపైన కొలువు తీరిన శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి



**బుచ్చి మే 12 ప్రభాతవార్త** పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి హంసవాహనంపైన భక్తులకు దర్శనమిచ్చారు.స్వామి వారిని పరిమళ పుష్పాలతో అలంకరించారు. గ్రామోత్సవంలో భక్తులు పెద్దఎత్తున స్వామి అమ్మవారిని దర్శించుకొని తరించారు. ఈకార్యక్రమానికి ఉభయకర్తలుగా రేబాలకు చెందిన లేబూరు శ్రీనివాసులురెడ్డి, లేబూరు వెంకటరామిరెడ్డి, లేబూరు రాధాకృ ష్ణారెడ్డి, లేబూరు సుబ్బరామిరెడ్డి వ్యవహారించారు.తిరుచాఉత్సవం ఉభయకర్తలుగా కీర్తిశేషులు శ్రీశైలంమల్లికార్జున శర్మకుమారులు శ్రీశైలం సురేష్‌శర్మ,శ్రీశైలం శశిశేఖర్ శర్మ, వ్యవహారించారు .కార్యక్రమాలను ఆలయచైర్మన్ తిరు మూరు అశోక్‌రెడ్డి, ఆలయ ఇఒ ఆర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి ,కమీటి సభ్యులు పర్యవేక్షించారు.

## గృహగణన సర్వే పరిశీలన



**కోట,మే 12 ప్రభాతవార్త** వంజి వాక గ్రామంలో జరుగుతున్న గృహగణన సర్వే జరు గుతుంది. మంగళవారంవంజివాక గ్రామానికి తహి సీల్దార్ వేళ్లారు. అక్కడ ఇంటింటి సర్వేను నిశితంగా పరిశీ లించారు. పారదర్శకంగా సర్వే చేయాలని ఆయ నఉద్యోగులను కోరారు.ఈ నెలఖారిలోపాల మండలంలో గృహగణన సర్వేను పూర్తి చేయడం జరుగు తుందని తహిసీల్దార్ జయజయరావు ఈ సందర్భంగా చెప్పారు.

## మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డిని విమర్శించే అర్హత నీకు లేదు

### వైసీపీ నేత చేజర్ల సుబ్బారెడ్డి ని ఏకిపారేసిన టిడిపి నేతలు

### స్థాయి మరిచి మాట్లాడితే తాటతీస్తాం చేజర్ల సుబ్బారెడ్డిని హెచ్చరించిన టిడిపి నేతలు



**నెల్లూరు, మే 12, ప్రభాతవార్త** మంగళవారం ఉద యగిరిలో తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు సందర్భంగా టీడీపీ ఉదయగిరి మండల కన్వీనర్ బయన్న, నాయకులు రియాజ్ మాట్లాడుతూ ఉద యగిరి మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్ర శేఖర్ రెడ్డిని విమర్శించే అర్హత వైసిపి నేత చేజర్ల సుబ్బారెడ్డికి లేదని హెచ్చరిం చారు.ఉదయగిరి నియోజకవర్గంలో నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఏకైక ప్రజా నాయకుడు చంద్రశేఖర్ రెడ్డిఅన్నారు. మండల అధ్యక్షుడిగా రాజకీయ బిక్ష పెట్టిందే చంద్రశేఖర్ రెడ్డి అని తల్లిపాలు తాగి రొమ్ము గుద్దినట్లు రాజకీయ బిక్ష పెట్టిన నేత చంద్రశేఖర్ రెడ్డిని విమర్శించే స్థాయికి వచ్చావా అని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అందర్నీ కలుపుకొని పోతున్నారని, ఎన్నికల ముందు తెలుగుదేశం పార్టీలో చేరి, వెంటనే మళ్ళీ కండువ మార్చి వైసీపీలో చేరిన నువ్వు చంద్రశేఖర్ రెడ్డి గురించి మాట్లాడే వ్యక్తివా, నువ్వు ఏ మొఖం పెట్టుకొని మాట్లాడతావని వారు దుయ్యబట్టారు.రాష్ట్ర ప్రజలకు రాజధానిని ఏర్పాటు చేసి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు నడిపిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూటమి నేతలపై వైసీపీ నేతలు చౌకబార్ మాటలు మాట్లాడడం సరైన విధానం కాదని వారు విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డిని విమర్శించే స్థాయి నీది కాదని నోరు జారి మాట్లాడితే నీకన్నా రెండింతలు మేము మాట్లాడతామని గుర్తుంచుకోవాలన్నారు. మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి గురించి రెండోసారి మాట్లాడి ఉదయగిరిలో తిరిగితే ని అంతుచూస్తాం అని వైసీపీ నేత సుబ్బారెడ్డి కి టిడిపి నేతలు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొజ్జ నరసింహులు, రాజా, ఓబుల్ రెడ్డి, శివ కృష్ణ పాల్గొన్నారు.

## హనుమజ్జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



**కోవూరు, మే12 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ దక్షిణాముఖ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రత్యేకంగా పూజాకార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి, ఏపీఎంఎఫ్‌సీఎల్ ఛైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డిలకు రుత్వికులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని పరిశీ లించారు. ఈ ఉత్సవాల సందర్భంగా పాల్గొన్న వీరిరువురిని ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యులు, రుత్వికులు శ్రీకాంతాచార్యుల ఆధ్వర్యంలో శాలువా, శేషవస్త్రంతో ప్రత్యేకంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వీరాంజనేయుని చల్లని చూపు కోవూరు ప్రజానీకంపై ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. ఇంతపెద్దఎత్తున ఉత్సవాలు నిర్వహించిన ప్రధాన అర్చకులు నాగరాజాచార్యులు, ఉభయకర్తలను ప్రత్యేకంగా అభినందించారు. ఆమె ఆలయంలోని భక్తులకు ప్రత్యేకంగా పలకరిస్తూ ముందుకు సాగారు. రానున్న హనుమజ్జయంతి లోగా ఆలయ ప్రాంగణంలో ఉన్న ఖాళీ స్థలంలో మండపం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు ఇంతా మల్లారెడ్డి సొసైటీ ఛైర్మన్ నాగారెడ్డి శ్యామ్ సుందర్‌రెడ్డి , పార్టీ సీనియర్ నాయకులు తాడిపర్తి విజయారెడ్డి, గాదిరాజు అశోక్‌కుమార్, పచ్చిక మధుసూదన్‌రావు, మల్లికార్జునరెడ్డి,,సాయిరెడ్డి, సాయి జయంత్‌రెడ్డి, మదన్‌రెడ్డి, కూటమి నేతలు సుబ్బారావు, శ్రీనివాసులురెడ్డి, వెంకటరమణమ్మ, తదితరులు ఉన్నారు.

## రైతులను లాకప్‌లో వేసి కొట్టడం అమానుషం : కాకాణి



**నెల్లూరు, మే 12, ప్రభాతవార్త-వైద్యం** రైతులకు, సాగునీటి మోటార్లకు విద్యుత్ కనెక్షన్‌లు ఇచ్చే విషయంలో విద్యుత్ శాఖ అధికారులు ఇషా రాజ్యంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ, అర్హులైన రైతులందరికీ విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వాలని మాజీ ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డా కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో వైయస్ఆర్ సీపి రైతు విభాగం నాయకులు, రైతులతో కలిసి నెల్లూరు నగరంలోని కరెంట్ ఆఫీస్ సెంటర్ లోని విద్యుత్ శాఖ కార్యాలయం నందు S.E (సూపరింటెండెంట్ ఇంజనీర్) ని కలిసి, పొదలకూరు ఎలక్ట్రికల్ ఏఈఈ పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు రైతులు తమ మోటార్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వమని అడిగితే, విద్యుత్ శాఖ అధికారులు లంచం తీసుకుని తెలుగుదేశం పార్టీ నాయకుల సిఫారస్ ఉంటే తప్ప, కనెక్షన్లు ఇవ్వలేమంటూ పంటలు ఎండబెడుతున్న వైనాన్ని చూస్తే, ఎవరైనా కంటతడి పెట్టాల్సిందే నన్న కాకాణి రైతులు తమకు విద్యుత్ కనెక్షన్లు ఎందుకు ఇవ్వడంలేదని, లంచం ముట్ట చెప్పినా పొదలకూరు విద్యుత్ శాఖ ఏఈఈ తెలుగుదేశం నాయకులను కలవాలని చెప్పడంతో అభ్యంతరం చెప్పిన రైతులను తెలుగుదేశం నాయకుల ఆదేశాల మేరకు పొదలకూరు సబ్ ఇన్స్పెక్టర్ హనీఫ్ రైతులను పిలిచి కొట్టడందుర్మార్గంఅని పేర్కొన్న కాకాణి రైతుల పక్షాన నిలబడి పోలీస్ స్టేషన్ ఎదుట మా నిరసన తెలియజేస్తే, రైతులపై కేసులు బనాయించడం కూటమి ప్రభుత్వానికి, చంద్రబాబు నాయుడుకే చెల్లింది అవినీతికి పాల్పడిన ఎలక్ట్రికల్ ఏఈఈ మీద ఇప్పటికే విచారణకు ఆదేశించామని సూపరింటెండెంట్ ఇంజనీర్ కాకాణికి తెలిపారు అవినీతి అధికారి పై చర్యలు తీసుకోకపోతే రైతులతో కలిసి ఉద్యమిస్తాము ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఉమ్మడి నెల్లూరు జిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేస్తుంది కాకాణి మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో సాగునీటి మోటార్లకు విద్యుత్ కనెక్షన్ లు ఇచ్చే ప్రక్రియలో కూటమి ప్రభుత్వం రాజకీయాలకు పాల్పడుతోంది సర్వేపల్లి నియోజకవర్గం లో అధికారుల అవినీతికి హద్దు లేకుండా పోయింది నావూరుపల్లి గ్రామానికి చెందిన హరికృష్ణ అనే రైతు విద్యుత్ కనెక్షన్ కోసం పొదలకూరు తినిని (అసిస్టెంట్ ఎలక్ట్రికల్ ఇంజనీర్) కి రూ. 40,000 లంచం ఇచ్చినప్పటికీ, కనెక్షన్ ఇవ్వకుండా కాలయాపన చేయడమేకాకుండా, అధికారపార్టీ నేతలను కలవాలని ఒత్తిడి చేయడం దారుణంరైతు హరికృష్ణ తన డబ్బులు తిరిగి అడిగినందుకు, తెలుగుదేశం పార్టీ నాయకుల ఆదేశాలతో పొదలకూరు ఎస్సై (SI) సదరు రైతును పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కొట్టడం, వీడియో కాల్ చేసి టిడిపి నాయకులు చూపించడం దుర్మార్గం విద్యుత్ శాఖ అధికారులు అర్హులైన రైతులను కాదని, కేవలం లంచాలు ఇచ్చిన వారికి లేదా అధికార పార్టీ వారు చెప్పిన వారికే విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నారు. విద్యుత్ కనెక్షన్ల కోసం ముందుగా దరఖాస్తు చేసుకున్న వారికి ప్రాధాన్యత ఇవ్వాలనే నిబంధనలు ఉన్నప్పటికీ, అధికారులు వాటిని తుంగలో తొక్కుతున్నారుతెలుగుదేశం పార్టీ నాయకుల సిఫార్సులు ఉన్నవారికి, అడిగినంత లంచాలు ఇచ్చుకున్న వారికే ప్రాధాన్యత క్రమంతో సంబంధం లేకుండా కనెక్షన్లు మంజూరు చేస్తున్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దగ్గర నుండి అధికారుల వరకు రిజిస్టర్ చేసుకున్న వారందరికీ సీనియారిటీ ప్రకారం విద్యుత్ కనెక్షన్లు ఇస్తామని పదే పదే చెబుతున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది మేము అధికారంలో ఉన్నప్పుడు ఎప్పుడూ ఇలాంటి వివక్ష చూపలేదు, మేము ఏ రోజైనా కనెక్షన్లు ఇవ్వొద్దని చెప్పామేమో ఒకసారి మీ పాత అధికారులను పిలిచి కొనుక్కోవచ్చు కొందరు ఏఈఈ (AEE)లు లంచాలకు ఆశపడి సీనియారిటీని పక్కన పెడుతున్నారు, దీనికి సంబంధించిన అన్ని ఆధారాలను సాక్ష్యాలతో సహా ఎస్‌ఈకి సమర్పించాబాధిత రైతులకు వెంటనే న్యాయం చేయాలి , అక్రమాలకు పాల్పడుతున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి బాధితులకు న్యాయం చేయాల్సిన పోలీసులు, అధికార పార్టీ నేతల ఆదేశాలతో రైతులను దుర్మార్గంగా కొట్టారు .పొదలకూరు ఎస్సై హనీఫ్ తీరు వల్ల మండలంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రైతులకు న్యాయం చేయాలని, రైతులను కొట్టిన ఎస్సైను ,లంచం తీసుకున్న అవినీతి అధికారులను సస్పెండ్ చేయాలి. వ్యవసాయ మోటార్లకు కనెక్షన్లు ఇచ్చే విషయంలో విద్యుత్ శాఖ అధికారులు వ్యవహరిస్తున్న తీరు అత్యంత దురదృష్టకరం. ముఖ్యంగా పొదలకూరు ఎలక్ట్రికల్ ఏఈఈ పై వ్యవహార్శైలిపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయి.

రైతుల దగ్గర లంచం డిమాండ్ చేస్తూ, రైతుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న సదరు అధికారిపై వెంటనే సమగ్ర విచారణ జరిపి, కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది కూటమిపాలనలో అధికారులు విచ్చలవిడిగా రెచ్చిపోతూ, అవినీతికి పాల్పడుతున్నారు

అవినీతి అధికారులను ఎవ్వరినీ విడిచి పెట్టే ప్రసక్తే ఉండదు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే విచారణ జరిపి, కఠిన చర్యలు తీసుకుంటాం ఎస్‌ఈని కలిసి వినతిపత్రం అందజేశాం. ఎస్‌సి సానుకూలంగా స్పందించి ,పరిస్థితులను చక్కబెడతామన్నారు క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను విద్యుత్ శాఖ ఉన్నత అధికారులకు వివరించాం.పొదలకూరు ఏ ఈ ఈ అవినీతి మీద చర్యలు తీసుకోకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తాము గత కొద్ది నెలల క్రితం పోక్సో (POCSO) కేసులో సస్పెండ్ అయిన సీఐ రవినాయక్‌ను మళ్లీ విధుల్లోకి తీసుకోవడాన్ని చూస్తుంటే కూటమిపాలనలో అవినీతి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు కేవలం ప్రజల దృష్టి మళ్లించడానికే సిఐ రవి నాయక్ ను సస్పెండ్ చేసినట్లు నాటకాలు ఆడి, రెండు నెలలకే ఏ విధంగా పోస్టింగ్ ఇచ్చారో అర్థం కావడం లేదు హైకోర్టు, సుప్రీంకోర్టు ఇచ్చిన సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా పోలీసులు వ్యవహరిస్తున్నారు అక్రమ కేసులు పెట్టి జైల్లో పెట్టి కొడుతున్న పోలీస్ అధికారులపై ప్రైవేట్ కేసులు వేస్తాం, మానవ హక్కుల కమిషన్ కు ఫిర్యాదు చేస్తాం అక్రమ కేసులకు ,అరెస్టులకు, జైళ్లకు భయపడే ప్రసక్తే లేదు చట్టం ఎవరి చుట్టం కాదు , పోలీసులు తమ తీరు మార్చుకోకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది పోలీసులు అమానుషంగా ప్రవర్తిస్తే, సామాన్యులు భయం వీడి తిరగబడితేనే పోలీసు వ్యవస్థలో మార్పు వస్తుంది సర్వేపల్లి నియోజకవర్గంలో విద్యుత్ శాఖలో ఆర్‌డి ఎస్ (RDS) పనులు ఆగిపోవడానికి సోమిరెడ్డికి కమిషన్‌లు రాకపోవడమే కారణం సిఎస్ ఆర్ నిధుల ద్వారా సైకిళ్ల పంపిణీ లో అయితే డీలర్ల వద్ద కమిషన్ లు తీసుకోవచ్చుఅని సోమిరెడ్డి కమిషన్లు వచ్చే పనుల తప్ప, రైతులకు, ప్రజలకు అవసరమైన ఏ పనులు చేయడం లేదు మహానాడు పేరు చెప్పి నన్ను తిట్టిపోవడం తప్ప అక్కడ కూటమి నాయకులు ఫోటోలకు ఫోజు ఇవ్వడం తప్ప చేసేది ఏమీ లేదునేను జ్యోతిషాలు చెప్పుకునే వ్యక్తి ని కాదు, మీరు నన్ను స్వామి అన్నా, వేరే విధంగా విమర్శించినా నేను పట్టించుకోను మేము ప్రజల్లో ఉండి ప్రజల కోసం పనిచేసే వ్యక్తులం, ప్రజల నాడి మాకు తెలుసు, కూటమి ప్రభుత్వంపై ఎంత వ్యతిరేకత ఉందో క్షేత్రస్థాయిలో తిరిగితే తెలుస్తుందినేను చెప్పేది జోష్యం,అనుకోండి ప్రశ్న అనుకోండి ఏదైనా అనుకోండి, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా నెల్లూరు జిల్లాలోని కందుకూరు తో కలిపి11కి 11 స్థానాల్లో, రెండు పార్లమెంట్ స్థానాల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుంది అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షాన ఉంటూ వారి సమస్యలను తీర్చడమే ధ్యేయంగా పనిచేస్తాం

## నారాయణ అధ్యాపకురాలు చల్లా జోత్స్నాదేవికి డాక్టరేట్ ప్రధానం



**నెల్లూరు,మే12 ప్రభాతవార్త-విద్య** నగరంలోని స్దానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాల ఎంబిఏ విభాగానికి చెందిన అధ్యాపకురాలు చల్లా జోత్స్నదేవికి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాయం డాక్టరేట్‌ను ప్రధానం చేసింది.ఈ సందర్భంగా మంగళవారం స్దానిక కళాశాలలో అధ్యాపకురాలికి అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఎంబిఏ డీన్ గంగినేని ధనుంజయ్ మాట్లాడుతు ఆచార్య పి.రఘునాధరెడ్డి పర్యవేక్షణలో ఫుడ్ అండ్ బ్రేవరేజ్ ఇండస్ట్రీ పై జరిపిన పరిశోధనలో తమ అధ్యాపకురాలికి డాక్టరేట్ రావటం సంతోషంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో ఆమే మరిన్ని విజయాలు అందుకోవాలని కోరారు. అలాగే ఆమేకు డాక్టరేట్ రావటం పట్ల కళాశాల డైరెక్టర్స్ డాక్టర్ బి.దత్త్రాత్రేయ, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రవి ప్రసాద్‌లు శుభాకాంక్షలు తెలియజేయటం జరిగింనదన్నారు. జి.మల్యాద్రి, అధ్యా పకులు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నారాయణ హాస్పిటల్లో ఘనంగా జరిగిన అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవం



**నెల్లూరు, మే 12, ప్రభాతవార్త-వైద్యం** నారాయ ణ మెడికల్ కాలేజీ హాస్పిటల్లో అంతర్జాతీయ న ర్సింగ్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నారాయణ వైద్య విద్యా సంస్థలడైరక్టరన పి.ఇందిర విచ్చేశారు. అనంతరం ఇందిర మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య అవసరాలకు నర్సుల సేవలు ఎం తోవిలువైనవని, రోగులు కోలుకునేందుకు 90శాం నర్సింగ్ సేవలతోనే సాధ్యమవుతుందన్నారు. నారాయణ హాస్పిటల్లోని నర్సింగ్ విభాగం ఎంతో పటిష్టంగా ఉందన్నారు. నర్సింగ్ సేవలలో ఆధునీకరణతో పాటు రోగి భద్రత, ఆరోగ్య పరిరక్షణ తదితరాలు ఎంతో ముఖ్యమన్నారు. ఆరోగ్య సంరక్షణలో అంకిత భావం, ప్రేమ, సేవాభావంతో పని చేస్తున్న నర్సులందరికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక, ఆటల పోటీలలో పాల్గొని విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ మెడికల్ కళాశాల డీన్ డాక్టర్ పి.శ్రీనివాసులురెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, అడిషనల్ హెడ్ రామారావు, డెంటల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అజయ్ జినాల్డ్, డాక్టర్ సునీల్, డాక్టర్ ప్రభాకర్, అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వైష్ణవి, డాక్టర్ సహస్ర, హాస్పిటల్ ఏజీఎం ఏసీ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమత్ జయంతి ఉత్సవాలు





**కోవూరు,మే 12ప్రభాతవార్త :** హనుమత్ జయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళ వారం ఆలయ ప్రాంగణంలో స్వామివారికి విశ్వక్సే న ఆరాధ న,పుణ్యా హవచనం, పంచగవ్యారాధన కార్యక్రమాలను ప్ర ధానరుత్వికులు శ్రీకాంతాచార్యులు, నాగ రాజాచార్యుల ఆధ్వర్యంలో రుత్వికులు భక్తిశ్రద్ధలతో చేపట్టారు.ఈసందర్భంగా శ్రీకాంతా చార్యులు ఆధ్వర్యంలో హోమం నిర్వహించి పూర్ణాహుతి కార్యక్రమాలు ఘ నంగా చేపట్టారు. అనంతరం స్వామి వారి విగ్రహానికి భక్తులచే ప్రత్యేకంగా పాలాభిషేకం చేయించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో కలిశ ఊరేగింపు కార్య క్రమాలను అత్యంత వైభవంగా చేపట్టారు .ఈ కార్యక్రమంలో రుత్వికులు సుబ్బయ్య స్వామి,నందకిషోర్ స్వామి, ఫణీంధ్ర స్వామి,శేఖర్ స్వామి, భక్తులు ఉన్నారు.

## కిమ్స్ హాస్పిటల్‌లో అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవం



**నెల్లూరు, మే 12, ప్రభాతవార్త-వైద్యం** నెల్లూరు కిమ్స్ హాస్పిటల్ నందు అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కిమ్స్ హాస్పిటల్ నర్సింగ్ సిబ్బంది, డాక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ సిబ్బంది ఫ్లోరెన్స్ నైటింగేల్స్ చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ ఆమె చేసిన సేవలను స్కిట్ రూపంలో ప్రదర్శించి అందరికి ఆమె సర్వీసులను గుర్తు చేశారు. ప్రతినిత్యం నర్సింగ్ సిబ్బందివారు పేషెంట్లతో 24 గంటలు చేస్తున్నటువంటి సేవలను ఈ కాసేపు కార్యక్రమం ద్వారా సాంస్కృతిక కార్యక్రమాల తోటి కొంచెం ఊరట కలిగింది. వారు చాలా ఉల్లాసంగా ఉత్సాహంగా వారి యొక్క శారీరక మానసిక శ్రమను మైమరిచి ఆనందించారు. కిమ్స్ యాజమాన్యం ప్రతిభవంతులైన నర్సింగ్ సిబ్బందికి జ్ఞాపికలు అందజేసి వారి యొక్క విశిష్ట సేవలకు గుర్తింపుగా ప్రశంసా పత్రాలను అందజేసి వారి యొక్క సేవలను కొనియాడి ఘనంగా నర్సింగ్ సిబ్బందిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ యాజమాన్యం, డాక్టర్లు పాల్గొని నర్సింగ్ సేవలు ఎనలేనివని వారి యొక్క సేవా దృక్పథాన్ని వారు ఎంచుకున్నటువంటి ఈ సేవ మార్గాన్ని విలువ కట్టలేనిదని కొనియాడారు.

## వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు





**బుచ్చి మే 12 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని ముంబాయి రహదారిలో వేణుగోపాలస్వామి ఆలయంలో కొలువైవున్న శ్రీ అభయాజనేయ స్వామి వారికి హనుమజ్జయంతి సందర్భంగా అత్యంత వైభవంగ వేడుకలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. అభిషేకాల ఉభయకర్తలుగా జొన్నలగడ్డప్రకాష్‌రావు, ఊటుకూరుకమలాకర్ వ్యవహారించారు. సర్వదోష నివారణహోమం ఉభయకర్తలుగా చిన్ని వెంకటర మణయ్య (సివిఆర్ ),నిర్మల, కాకరపర్తి ప్రభాకర్, రమాదేవి, మెంటా ఆనంద్,సృజనా వ్యవహారించారు.కార్యక్రమాలను ఆలయ కమీటి అధ్యక్షులు ఇనుగూరు సుబ్బారావు, తెల్లనాకుల సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కారంశెట్టిప్రసాద్, పర్యవేక్షిం చారు అన్న దాన ఉభయకర్తలుగా సహకారం అందించిన వారు తెల్ల నాకుల సుబ్బారావు వ్యవహారించారు. కార్యక్రమంలో పెద్దలు ఇనుగూరు బాలయ్య, పలువురు పాల్గొన్నారు. ప్రజలు ఆంజనేయస్వామిని దర్శించుకొని పరవశించారు.

## ఆధునిక వసతులతో లేవుట్‌ను అందజేస్తాం

### నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి



**కావలి, మే 12 ప్రభాతవార్త :** ఆధునిక వసతు లతో కూడిన లేవుట్‌ను పూర్తి చేసి నాలుగు నుంచి ఐదు నెలల వ్యవధిలో లబ్దిదారులకు అందజేయడం జరుగుతుందని నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. జలదంకి మండలం, జమ్మలపాలం వద్ద నుడా లేవుట్‌ను నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌లతో కలసి మంగళవారం పరిశీలించారు. ఈ ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ది పనులను ప్రత్యేక్షంగా పరిశీలించి అక్కడి పరిస్థితులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం లేవుట్ యజమానులు, ప్లాట్లు కొనుగోలు చేసిన లబ్దిదారులు తమ సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు. మౌళిక వసతులైన రోడ్లు, డ్రైనేజీ వంటి సమస్యలు. శుభ్రతా నిర్వహణ వంటి అంశాలను వారు ప్రస్తావించారు. ప్రజలు తెలిపిన సమస్యలను విని ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ లేవుట్ కొనుగోలు చేసిన ప్రతి ఒక్కరికి నాణ్యమైన వసతులు కల్పించడం ప్రభుత్వ బాధ్యతని పేర్కొన్నారు. సిసిరోడ్లు, సమగ్ర డ్రైనేజీ వ్యవస్థ,జంగిల్ క్లీయరెన్ పనులను ప్రాధాన్యత అధారంగా చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజలుఎలాంటి ఇబ్బందులు పడకుండా చూసుకుంటామని తెలిపారు. ఈ పరిశీలన కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, లేవుట్ యజమానులు, కొనుగోలుదారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కోటలో హనుమజ్జయంతి వేడుకలు



**కోట, మే 12 ప్రభాతవార్త** హనుమజ్జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయంలో ఉత్సవ మూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభయాంజనేయస్వామికి అర్చకులు అభిషేక అర్చన, ప్రత్యేక పూజలు చేశారు. పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన గావించారు. మహానివేదన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలుఅందజేశారు. అదేవిధంగా సిద్ధ వరం గ్రామంలో హనుమజ్జయంతి వేడుకలు వై భవంగా నిర్వ హించారు. ఆలయం కాషాయమయంగా మారింది. ఓం శ్రీరామ్, జయరామ్,జయరామ్ అంటూనామస్మరణతో మార్మోగింది . స్వామిని దర్శించుకోవా లన్న తపనతో భక్తులు తరలివచ్చారు.

